తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
31-05-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 115
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## ఫ్రంటల్ పైరవీల దందా
# కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి

- మంత్రుల పేర్లతో వసూళ్ల ఆరోపణలు
- ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్ల పేరిట మోసాలు
- ఫోటోలు పెట్టుబడిగా అమాయకులే లక్ష్యం
- గాంధీభవన్‌కు చేరిన బాధితుల ఫిర్యాదులు
- యూత్ కాంగ్రెస్ నేతపై పోలీసు కేసు నమోదు
- ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలుగుతోందన్న ఆందోళన
- పార్టీ పునాదులనే దెబ్బతీస్తున్న పైరవీకారులు
- అధిష్ఠానం, పోలీసుల చర్యలపై ఆసక్తి

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్**

పదేళ్ల విరామం తర్వాత తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు ఫ్రంటల్ ఆర్గనైజేషన్లలోని కొందరు నేతల వ్యవహారం తలనొప్పిగా మారినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాము మంత్రులకు అత్యంత సన్నిహితులమంటూ ప్రచారం చేసుకుంటూ, ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు

మిగతా 2వ పేజీలో..

# రైతు డిస్కమ్‌పై సర్కారు మల్లగుల్లాలు!

**లైసెన్స్ జారీ విచారణ సందర్భంగా పలు అనుమానాలు**

- సమాధానము ఇవ్వలేకపోయిన అధికారులు
- ఇంత వ్యతిరేకత వస్తుందనుకోలేదు..
- పునరాలోచనలో రేవంత్ రెడ్డి సర్కార్
- ప్రతిపక్షాల చేతికి పదునైన అస్త్రంగా మారనున్న ప్రభుత్వ తొందరపాటు నిర్ణయం
- ఉద్యోగస్తులు సహకరించకుంటే ఎలా?
- మనుగడపై విద్యుత్ నిపుణుల సంచలన ప్రశ్నలు
- లైసెన్స్ రాకముందే జూన్ 2న ప్రారంభిస్తామన్న సీఎం
- ఇప్పుడు వాయిదా యోచనలో సర్కార్

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా రైతు డిస్కమ్ (మూడో డిస్కమ్) ఏర్పాటుపైనే తీవ్రస్థాయిలో చర్చ నడుస్తోంది. రైతు ప్రయోజనాల కోసమేనంటూ కొత్త డిస్కమ్ ఏర్పాటుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి.. తాజా లైసెన్స్ జారీ బహిరంగ విచారణలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. విచారణ సందర్భంగా వెల్లువెత్తిన సాంకేతిక, పరిపాలనాపరమైన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక విద్యుత్ శాఖ అధికారులు చేతులెత్తేశారు. భారత దేశ చరిత్రలోనే కేటగిరి వారీగా ఎక్కడా ఇలాంటి డిస్కమ్ ఏర్పాటు చేయలేదు. ఇప్పటికే రూ.67 వేల కోట్ల భారీ నష్టాలతో నడుస్తున్న విద్యుత్ సంస్థల నుండి.. ఏకంగా రూ.25 వేల కోట్ల అప్పుల వాటాను నెడుతూ ఒక కొత్త సంస్థను ప్రారంభించడం అంత సులభం కాదన్న వాస్తవాన్ని అధికారులు విస్మరించారు. విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం నుండే రూ.54 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఉన్న డిస్కమ్‌లకే పైసలు కట్టే పరిస్థితి లేనప్పుడు, కొత్త సంస్థను చేసి దాని నిర్వహణ ఎలా చేస్తారన్న దానికి అధికారుల వద్ద కనీస

మిగతా 2వ పేజీలో..

TELANGANA RYTHU POWER DISTRIBUTION COMPANY LIMITED
TGRPDCL

## సీబీఎస్ఈ మార్కుల గందరగోళంపై సమాధానం చెప్పాలి

**హైదరాబాద్, మే 30, సిరి న్యూస్:**

సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదంపై పోరాడుతున్న విద్యార్థులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ K. T. Rama Rao మద్దతు తెలిపారు. మార్కుల కేటాయింపులో జరిగిన అవకతవకలపై విద్యార్థులు, తల్లిదండ్రులు పారదర్శకత కోరే హక్కు కలిగి

మిగతా 2వ పేజీలో..




**ఆటా తెలుగు మహాసభలకు కేటీఆర్‌కు ఆహ్వానం** 2

**కాంగ్రెస్ కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం** 2



## చెరువు అభివృద్ధి పేరుతో భారీ కుట్ర..

- బట్టబయలు చేసిన హైడ్రా
- ముష్కిన్ చెరువులో అక్రమ నిర్మాణాల కూల్చివేత
- రూ. 5,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి రక్షణ
- చెరువు మధ్యలో నిర్మించిన ఎంబ్యాంక్‌మెంట్ తొలగింపు
- పేదల పేరుతో భూకబ్జా యత్నానికి చెక్
- జలవనరుల పరిరక్షణలో హైడ్రా మరో కీలక ఆపరేషన్

3

## కొనుగోలు కేంద్రాల్లో రైతుల గోస

- అన్నదాత కన్నీరు కనిపించడం లేదా?
- కటింగ్‌లతో మిల్లర్ల దోపిడీ
- ప్రభుత్వ తీరుపై హరీశ్‌రావు ఆగ్రహం



3

## విజయవాడ హైవేపై ట్రావెల్స్ బస్సు దగ్ధం

- అప్రమత్తమైన డ్రైవర్‌తో తప్పిన పెను ప్రమాదం
- ప్రాణాలతో బయటపడ్డ 36 మంది ప్రయాణికులు
- ఇంజిన్‌లో మంటలతో బస్సు పూర్తిగా కాలిపోవడం
- పెద్దకాపర్తి సమీపంలో ఘటన
- కారణాలపై దర్యాప్తు

**నల్గొండ, మే 30, సిరి న్యూస్:**

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి

మిగతా 2వ పేజీలో..





## తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

- 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం
- కేశవరావు కమిటీ తొలి భేటీ

**హైదరాబాద్, మే 30, సిరి న్యూస్:**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు అధ్యక్షతన శనివారం సచివా లయంలో

మిగతా 3వ పేజీలో..




## గిరిజన గురుకులాలు దేశానికే ఆదర్శం

- విద్యార్థులపై పెట్టుబడి భవిష్యత్తు తెలంగాణపై పెట్టుబడే
- దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యకు రేవంత్ సర్కార్ పెద్దపీట
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి

**హైదరాబాద్, మే 30, సిరి న్యూస్:**

విద్యను ఖర్చుగా కాక భవిష్యత్తు తరాలపై చేసే పెట్టుబడిగా భావిస్తున్న రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బలహీనవర్గాల విద్యాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత

మిగతా 3వ పేజీలో..




## చదువే ప్రపంచాన్ని మార్చే ఆయుధం

- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 30, సిరి న్యూస్ :**

ప్రపంచాన్ని, జీవితాన్ని మార్చే శక్తి చదువుతోనే సాధ్యమవుతుందని, ఒకవేళ జీవితంలో అన్నీ కోల్పోయినా చదువు ఉంటే మళ్లీ నిలబడగలుగుతామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. కొంగరకలాన్‌లోని రంగారెడ్డి

మిగతా 2వ పేజీలో..




## పేదవాని గుమ్మం వద్దకు ప్రభుత్వ పథకాలు

- పట్టణ పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- పేదవాని గుమ్మం వద్దకు ప్రభుత్వ పథకాలు
- రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మే 30, సిరి న్యూస్ :**

పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార

మిగతా 3వ పేజీలో..



## ఫ్రంటల్ పైరవీల దందా
# కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి

**మొదటిపేజీ తరువాయి**

ఇప్పిస్తామని చెప్పి అమాయకుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
సచివాలయంలో మంత్రులతో దిగిన ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రభావశీలులమనే భావన కల్పిస్తున్నారని సమాచారం. ఆ తర్వాత ఉద్యోగాలు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిలు ఇప్పిస్తామంటూ ఒక్కో వ్యక్తి వద్ద లక్షల రూపాయలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. డబ్బులు అందుకున్న తర్వాత బాధితులకు అందుబాటులో లేకుండా పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
ఈ వ్యవహారం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు కూడా విస్తరించినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల యూత్ కాంగ్రెస్‌కు చెందిన ఓ నాయకుడు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలతో సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో మరికొంత మంది వద్ద కూడా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పేరుతో కూడా కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వెలుగులోకి వస్తున్నాయి. బాధితుల్లో కొందరు సాక్ష్యాధారాలతో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం గాంధీభవన్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారం పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ పెరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో, కొందరి చర్యలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయనే ఆవేదన కాంగ్రెస్ నాయకుల్లో వ్యక్తమవుతోంది. మంత్రుల పేర్లు ఉపయోగిస్తూ జరుగుతున్న ఈ తరహా మోసాలకు అడ్డుకట్ట వేయకపోతే ప్రభుత్వం, పార్టీపై ప్రజల్లో నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# సీబీఎస్ఈ మార్కుల గందరగోళంపై సమాధానం చెప్పాలి: కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి**


ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ప్రస్తుతం సీబీఎస్ఈ మార్కుల వివాదంలో కేంద్రంగా నిలిచిన గ్లోబరెనా సంస్థే 2019లో తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల గందరగోళానికి కారణమైన సంస్థ అని గుర్తుచేశారు. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు సంస్థపై న్యాయపరమైన చర్యలు చేపట్టిందన్నారు.
గత చరిత్ర ఉన్నప్పటికీ అదే సంస్థకు సీబీఎస్ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ఆశ్చర్యకరమని, నిబంధనలను సైతం సవరించి సంస్థకు అనుకూలంగా వ్యవహరించినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు.
ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ సమాధానం చెప్పాలని డిమాండ్ చేసిన కేటీఆర్, విద్యార్థుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి, తప్పిదాలను సరిదిద్ది, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.



## ఆటా తెలుగు మహాసభలకు
# కేటీఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, మే 30, సిరి న్యూస్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే టి రామారావు ను అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. 2026 జూలై 31, ఆగస్టు 1, 2 తేదీల్లో అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలో నిర్వహించనున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ATA) తెలుగు మహాసభలకు హాజరుకావాలని ఆహ్వానించింది. ఈ సందర్భంగా ఆటా అధ్యక్షుడు జయంత్ చల్ల ఆటా కాన్ఫరెన్స్ నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల మహాసభల సందర్భంగా నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలను కేటీఆర్‌కు వివరించారు. అలాగే అమెరికాలో నివసిస్తున్న భారతీయుల పరిస్థితులు, అక్కడి రాజకీయ పరిణామాలపై కూడా చర్చించారు.
ఈ సమావేశంలో ఆటా కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ తిరుమల రెడ్డి ,ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆటా తెలుగు మహాసభలకు హాజరయ్యేందుకు కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు.



# విజయవాడ హైవేపై ట్రావెల్స్ బస్సు దగ్ధం

**మొదటిపేజీ తరువాయి**

ఆహుతైంది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో జరిగిన ఈ ఘటనలో 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న రెయిన్‌బో ట్రావెల్స్ బస్సులో ప్రయాణ మధ్యలో ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పరిస్థితిని గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును రోడ్డుపక్కన నిలిపి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. ప్రయాణికులంతా దిగిన కొద్దిసేపటికే మంటలు బస్సు మొత్తం వ్యాపించడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బస్సులో మంటలు చెలరేగడానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

# రైతు డిస్కమ్‌పై సర్కారు మల్లగుల్లాలు!

**మొదటిపేజీ తరువాయి**

సమాధానం లేకుండా పోయింది.

**వెయ్యి మందితో 5 లక్షల సర్వీసులా?**

కొత్త డిస్కమ్ పరిధిలోకి వచ్చే విద్యుత్ అంతరాయాలను ఎలా ఎదుర్కొంటారు? సిబ్బంది సమీకరణ ఏంటి? అనే దానికి యాజమాన్యం వద్ద అసలు ప్రణాళికే లేదు. ఈ డిస్కమ్ పరిధిలో 5 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు, 2.50 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఇంత భారీ వ్యవస్థను నడపడానికి కేవలం 1000 మంది కింది స్థాయి సిబ్బందిని మాత్రమే తీసుకోవాలని యాజమాన్యం నిర్ణయించడంపై ఉద్యోగ, రాజకీయ, రైతు వర్గాలు భగ్గుమంటున్నాయి. తెలంగాణలో వ్యవసాయం ఎక్కువగా బోరుబావులపైనే ఆధారపడి ఉండటం వల్ల విద్యుత్ వినియోగం, సమస్యలు చాలా ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ 11కేవీ లైన్లు సబ్‌స్టేషన్ నుండి చివర వరకు 50 నుండి 60 కిలోమీటర్ల దూరం ఉంటాయి. కొత్త డిస్కమ్ లెక్కల ప్రకారం ఒక లైన్ మెన్ పరిధి సరాసరి 1500 కిలోమీటర్లు అవుతుంది. త్వరలో వర్షాకాలం రాబోతున్న వేళ, వందల సంఖ్యలో వచ్చే ఫిర్యాదులను ఈ కొద్దిమంది సిబ్బంది ఎలా పరిష్కరిస్తారనేది పెద్ద ప్రశ్న. పైగా కొత్తగా వచ్చే సిబ్బందికి ఈ లైన్లపై అవగాహన రావడానికే ఏడాది పడుతుంది.

**ఫీడర్లలో సమస్య వస్తే పట్టించుకునేదెవరు?**

కొత్తగా ఏర్పడే రైతు డిస్కమ్‌లోకి కేవలం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మాత్రమే వస్తాయి. కానీ వాటికి ఆధారమైన 11కేవీ లైన్లు, సబ్‌స్టేషన్లు మాత్రం పాత డిస్కమ్‌ల పరిధిలోనే ఉంటాయి. ఒకవేళ రేపు గ్రామీణ ప్రాంతాల్లోని డెడికేటెడ్ అగ్రికల్చర్ ఫీడర్లలో ఏదైనా సమస్య వస్తే.. పాత డిస్కమ్ అధికారులు వాటిని పట్టించుకునే పరిస్థితి ఉండదు. ఎందుకంటే ఆ ఫీడర్లలో తమకు సంబంధించిన కమర్షియల్ లేదా గృహ సర్వీసులు ఉండవు కాబట్టి వారు చేతులెత్తేస్తారు. ఈ రెండు డిస్కమ్‌ల మధ్య సమన్వయం కుదరకపోతే భవిష్యత్తులో అన్నదాతలకు మరిన్ని కరెంట్ కష్టాలు, చీకట్లు తప్పవని స్పష్టమవుతోంది.

**వ్యవసాయానికి 3 గంటలు చాలు.. కోదండరెడ్డి వ్యాఖ్యల దుమారం**

ఇదే సమయంలో ఈఆర్‌సీ విచారణలో తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ విధానాన్ని తీవ్ర సంకటంలోకి నెట్టాయి. సభలో చర్చ సందర్భంగా రైతులకు 3 గంటలు విద్యుత్ ఇస్తే చాలు.. పొలం చివర వరకు పారుతుంది అని ఆయన అనడం పెద్ద దుమారమే లేపింది. సీనియర్ నేతగా ఉండి క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియకుండా ఆయన మాట్లాడటం వివాదాన్ని పెద్దది చేసింది. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఇదే తరహా వ్యాఖ్యలు చేయడంతో.. ఇప్పుడు ఈ రెండింటినీ కలిపి సోషల్ మీడియాలో నెటిజన్లు, ప్రతిపక్షాలు విపరీతంగా ట్రోల్ చేస్తున్నాయి. కొత్త డిస్కమ్ ద్వారా రైతులకు ఇచ్చేది కేవలం మూడు గంటల కరెంటేనా? అంటూ రైతాంగం మండిపడుతోంది.

**జూన్ 2న ప్రారంభిస్తారా.. వాయిదా వేస్తారా?**

కొత్త డిస్కమ్ వల్ల ప్రజలకు మేలు జరుగుతుందంటూ కొందరు అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికల వల్లే ప్రభుత్వం ఇప్పుడు అభాసుపాలయ్యే పరిస్థితి వచ్చింది. దీనికి తోడు 30 శాతం వాటాదారులైన ఉద్యోగ సంఘాల సూచనలను యాజమాన్యం కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. మొన్నటి విచారణలో మేము పనిచేయడానికి నిరాకరిస్తే సంస్థ ఎలా నడుస్తుంది? అని ఉద్యోగ సంఘాలు అల్టిమేటం ఇవ్వడం ప్రభుత్వ పెద్దలను ఆలోచనలో పడేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్లప్పుడూ విమర్శల్లోని వాస్తవికతను గ్రహిస్తూ మార్పులు చేస్తుంటారు. అదే తీరున ఈ విషయంలోనూ తొందరపాటు పడకుండా, అన్ని వర్గాల సందేహాలను నివృత్తి చేయాలని డిసైడ్ అయినట్లు విశ్వసనీయ సమాచారం. రైతుల కోసం పెట్టే సంస్థ వారి వ్యతిరేకతకు కారణం కాకూడదన్నదే సీఎం భావన. జూన్ 2న రైతు డిస్కమ్ ప్రారంభిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ.. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తారా లేదా మొండిగా ముందుకు వెళ్తారా అనేది తేలాల్సి ఉంది.

# చదువే ప్రపంచాన్ని మార్చే ఆయుధం

**మొదటిపేజీ తరువాయి**

జిల్లా కలెక్టరేట్‌లో మహిళా వారోత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్, అమ్మకు అక్షరమాల, అంగన్‌వాడీ యూనిఫాంల పంపిణీ కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని మహిళలకు పిలుపునిచ్చారు. నెల్సన్ మండేలా చెప్పిన ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉంది అనే సూక్తిని ప్రస్తావించిన మంత్రి, చదువుతోపాటు సంస్కారం కూడా జీవితంలో అంతే ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం, సమాజంతో మమేకం కావడం, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం అవసరమని సూచించారు. స్నేహ సంఘాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది టీనేజీ బాలికలను పదివేలకుపైగా స్నేహ గ్రూపులుగా ఏర్పాటు చేసి భద్రత, ఆరోగ్యం, పోషకాహారం, విద్య, సాధికారత అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా వాటిని విద్య, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. పెళ్లి అయినా, వృద్ధాప్యం వచ్చినా మీతో ఉండేది మీ చదువు, మీ విజ్ఞానం మాత్రమే అంటూ ప్రతి బాలిక ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా కృషి చేయాలని కోరారు.
అంగన్‌వాడీ యూనిఫాంల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ గర్భధారణ దశ నుంచి మూడేళ్ల వయస్సు వరకు పిల్లల పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. యూనిఫాంలను ప్రజా ప్రభుత్వం అందిస్తున్నదని, 57 రకాల విద్య, ఆట వస్తువులను పంపిణీ చేస్తున్నదని చెప్పారు. తొలి ముద్ద కార్యక్రమం ద్వారా అల్పాహారం, పాలు, గుడ్లు, పోషకాహారం అందిస్తున్నామని వివరించారు. ప్రైవేట్ నర్సరీల్లో అన్నం, పాలు, గుడ్లు ఇవ్వరు.. కానీ ప్రభుత్వ అంగన్‌వాడీల్లో పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం అని చెప్పారు. ప్రైవేటు బడి వద్దు.. అంగన్‌వాడి ముద్దు అని మంత్రి అన్నారు. అంగన్‌వాడీ విద్య పూర్తి చేసుకుని మొదటి తరగతిలో చేరుతున్న చిన్నారులకు విద్యారంభ ధ్రువపత్రాలను మంత్రి అందజేశారు. స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్‌లో బాలికలు విద్య, ఆరోగ్యం, సైబర్ భద్రత, రవాణా, పాఠశాల మౌలిక వసతులు, మహిళా ఉపాధ్యాయుల నియామకం, శానిటరీ న్యాప్‌కిన్ల పంపిణీ తదితర అంశాలపై ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వ పథకాలపై సంబంధిత అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాలికలు తమ సమస్యలను ధైర్యంగా వ్యక్తపరిచే వేదికగా స్నేహ సంఘాలు నిలుస్తున్నాయని అన్నారు. మహిళల అక్షరాస్యత పెంపు కోసం చేపట్టిన అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా లక్షలాదిమంది మహిళలు చదవడం, రాయడం నేర్చుకుని వేలిముద్రకు బదులు సంతకం చేసే స్థాయికి చేరుకున్నారని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మహిళా కమిషన్ సభ్యురాలు సదాలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, శాఖ డైరెక్టర్ శృతి ఓజా, పంచాయతీరాజ్ కమిషనర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అధికారులు, స్నేహ సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



# కాంగ్రెస్ కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

- **చిన్న కాంట్రాక్టర్లకు నిధులు, టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి**
- **జీవో 17 రద్దయ్యే వరకు పోరాటం ఆపేది లేదు**
- **ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్ల మహా ధర్నాలో కేటీఆర్**




**హైదరాబాద్, మే 30, సిరి న్యూస్ :**

ఎన్నికలకు ముందు 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు, 420 హామీలతో మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను నట్టేట ముంచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద శనివారం జరిగిన మహా ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.ఎన్నికల ముందు చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్ల పేరుతో ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18, ఎస్టీలకు 12, బీసీలకు 42 శాతం (మొత్తం 72 శాతం) రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికారని, అధికారంలోకి వచ్చాక 72 పైసలు కూడా ఇవ్వకుండా అడ్డగోలు జీవోలు తెచ్చారని మండిపడ్డారు. చివరికి గురుకుల పాఠశాలల్లో స్థానిక కాంట్రాక్టర్లు సరఫరా చేసే కూరగాయలు, చికెన్, పాలు, బ్రెడ్ వంటి వాటిని కూడా దక్కకుండా చేస్తూ జీవో నెం.17 తీసుకొచ్చి ఆ టెండర్లను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. చిన్న కాంట్రాక్టర్లను రోడ్లపైకి తెచ్చిన జీవో 17 రద్దయ్యే వరకు, బడుగు, బలహీనవర్గాలకు కాంట్రాక్టులు దక్కే వరకు పోరాటం ఆపేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

**నిధులు, టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

రాష్ట్రంలో కాంట్రాక్టులు కేవలం ఇద్దరికే దక్కుతున్నాయని, రేవంత్ రెడ్డి బావమరిది, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకుకే ఇస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం నియోజకవర్గం కొడంగల్‌నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రూ.4 వేల కోట్ల కాంట్రాక్టును తన అనుయాయులకే ఇచ్చుకున్నారని విమర్శించారు. కేవలం వాళ్ల బంధువులకే కాక బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌కు రూ.1300 కోట్ల కాంట్రాక్టులు ఇస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్ల అప్పు చేశారని, అందులో రూ.4 అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్టర్లకు ఇచ్చారా అని ప్రశ్నించారు. చిన్న కాంట్రాక్టర్లకు విడుదల చేసిన నిధులు, చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము రేవంత్ సర్కార్‌కు ఉందా అని కేటీఆర్ సవాల్ విసిరారు.

**రేవంత్ రెడ్డి రెన్యువల్ సీఎం మాత్రమే**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని, కేవలం రెన్యూవల్ సీఎం అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు నెలనెలా కప్పం పంపి తన కుర్చీని కాపాడుకుంటున్నారని, ఢిల్లీకి బ్యాగులు మోసినన్ని రోజులు మాత్రమే ఆయన ఉద్యోగం ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ బడుగులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా ఢిల్లీ హైకమాండ్ మౌనంగా ఉండటానికి ఇదే కారణమన్నారు. ఈ ద్రోహానికి రేవంత్‌తోపాటు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలను కూడా నిలదీయాలని పిలుపునిచ్చారు.

**కేసీఆర్ హయాంలో సంపద సృష్టి**

బీఆరఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ సంపద సృష్టించాలిపేదలకు పంచాలి అనే దృక్పథంతో పనిచేశారన్నారు. నాడు చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుని గౌరవంగా నిలబెట్టారని గుర్తు చేశారు. కేసీఆర్ అప్పులు చేసి వెయ్యికిపైగా గురుకులాలు కట్టించి 6.50 లక్షల మంది బడుగు విద్యార్థులకు ఒక్కొక్కరిపై రూ.1.20 లక్షల నుండి రూ.1.25 లక్షల వరకు ఖర్చు పెట్టి కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, బూట్లు, బట్టలు, నాణ్యమైన భోజనం అందించారన్నారు. అప్పులతోనే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, జిల్లాకో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ తెచ్చారని, 24 గంటల కరెంట్, కేసీఆర్ కిట్, 15 లక్షల మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి కింద ఆర్థిక సాయం అందించారని తెలిపారు. రూ.72 వేల కోట్ల రైతుబంధు సాయాన్ని నేరుగా ఖాతాల్లో వేశారని గుర్తు చేశారు. తనకు చేతగాక కేసీఆర్ అప్పులు చేశాడని రేవంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు.

**2028లో మన ప్రభుత్వమే వస్తుంది**

మక్కలు, వడ్లు కొనుగోలు కాక రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఏ ఊరికైనా కాంగ్రెస్ వాళ్లు వెళ్లే ధైర్యం ఉందా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రుకాల్చి వాత పెట్టి, బొంద పెట్టాలని ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగితే ఆరఎస్ ప్రవీణ్ కుమార్ ఎ పోరాడారో బడుగుల సమస్యలపై కూడా అలాగే పోరాడతామన్నారు. బడుగువర్గాల సమస్యలపై అధికారులకు, మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వాలని, ఒకవేళ వాళ్ళు వినకపోతే భవిష్యత్తులో ఢిల్లీ వేదికగా పోరాడతామని హెచ్చరించారు. 2028లో తప్పకుండా బీఆరఎస్ ప్రభుత్వమే వస్తుందని, నాడు 10 వేల మంది కాదు దాదాపు 50 వేల మంది బడుగు, బలహీనవర్గాల యువకులను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దే బాధ్యతను కేసీఆర్ తీసుకుంటారని కేటీఆర్ అభయమిచ్చారు.

**న్యాయవాది ఖాజా కుటుంబానికి కేటీఆర్ పరామర్శ**

మాసాబ్ ట్యాంక్‌లో ఇటీవల దారుణ హత్యకు గురైన ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ నివాసాన్ని కేటీఆర్ శనివారం సందర్శించారు. లాయర్ మొయినుద్దీన్ అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేటీఆర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట బీఆరఎస్ సీనియర్ నాయకులు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, తలసాని సాయికిరణ్ యాదవ్‌తోపాటు పలువురు ముఖ్య నేతలు, కార్యకర్తలు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషించే ఒక న్యాయవాదిని హత్య చేయడం అత్యంత విచారకరమని, ఈ ఉదంతాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ ఘోర ఉదంతంపై ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఈ కేసును వేగంగా విచారించి బాధ్యులకు తగిన శాస్తి జరిగేలా చూడాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేయాలని, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కష్టసమయంలో బీఆర్ఎస్ పార్టీ మొయినుద్దీన్ కుటుంబానికి అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకు పోరాడతాని స్పష్టం చేశారు.



# చెరువు అభివృద్ధి పేరుతో భారీ కుట్ర..

**హైదరాబాద్, మే 30 , సిరి న్యూస్:**

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జలవనరుల పరిరక్షణపై దృష్టి సారించిన హైడ్రా, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాల్‌గూడ-నార్సింగి పరిధిలోని ముష్కిన్ చెరువులో భారీ స్థాయిలో చేపట్టిన చర్యలతో మరోసారి చర్చనీయాంశంగా మారింది. చెరువు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై శనివారం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి వాటిని తొలగించింది.

అధికారుల వివరాల ప్రకారం, ముష్కిన్ చెరువు అభివృద్ధి పేరుతో చెరువు మధ్యభాగంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. చెరువులో మట్టి పోసి ఎంబ్యాంక్మెంట్ నిర్మించడం ద్వారా జలవనరుల విస్తీర్ణాన్ని తగ్గించే ప్రయత్నం జరిగినట్లు నిర్ధారించారు. దీంతో హైడ్రా బృందాలు రంగంలోకి దిగి జేసీబీల సహాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించాయి.

హెచ్ఎండిఏ రికార్డుల ప్రకారం ముష్కిన్ చెరువు 52.20 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, రెవెన్యూ రికార్డుల్లో 59.11 ఎకరాలుగా నమోదై ఉంది. ఇందులో సుమారు 20.23 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఉంది. ఈ భూములపై ఆక్రమణల ప్రయత్నాలు జరిగినట్లు గుర్తించిన అధికారులు వాటిని అడ్డుకునేందుకు చర్యలు చేపట్టారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో గుడిసెలు ఏర్పాటు చేసి ఆక్రమణలకు ప్రయత్నించిన వారిని గతంలోనే గుర్తించిన హైడ్రా అధికారులు నోటీసులు జారీ చేశారు. అనంతరం సంబంధిత వ్యక్తులు స్వచ్ఛందంగా స్థలాలను ఖాళీ చేయడంతో, అధికారులు ఎలాంటి ఆటంకం లేకుండా ఆక్రమణలను తొలగించారు. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపట్టిన నిర్మాణాలపై కూడా హైడ్రా దృష్టి సారించింది. చెరువు విస్తీర్ణాన్ని తగ్గించేలా చేపట్టిన పనులపై విచారణ కొనసాగుతోంది. చెరువు సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు. ముష్కిన్ చెరువులో చేపట్టిన ఈ ఆపరేషన్‌తో ప్రభుత్వ భూములు, జలవనరుల పరిరక్షణ విషయంలో రాజీ ఉండదనే సంకేతాన్ని హైడ్రా ఇచ్చింది. నగర పరిసర ప్రాంతాల్లోని ఇతర చెరువులు, కుంటలపై కూడా ఇదే తరహా చర్యలు కొనసాగనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో రైతుల గోస

**సిద్దిపేట, మే 30, సిరి న్యూస్:**

రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని, కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన వడ్లు పోసి 50 రోజులుగా ఎదురుచూస్తున్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన హరీశ్‌రావు, కేంద్రంలో ఇంకా 40 నుంచి 50 లారీల మేర ధాన్యం పేరుకుపోయి ఉండగా ఆరు రోజులకో లారీ పంపడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లర్లు క్వింటాల్‌కు ఐదారు కిలోల వరకు కటింగ్‌లు పెడుతూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే కొనుగోళ్లు వేగవంతం చేసి, కటింగ్‌లు లేకుండా ధాన్యం దిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు.రైతులు ఇన్ని రోజులు కష్టపడి పండించిన ధాన్యాన్ని బీగ్రేడ్‌గా చూపించి వేల రూపాయల నష్టం కలిగిస్తున్నారని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఇలాంటి ఇబ్బందులు పడలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మిల్లర్ల దయాధర్మాలపై వదిలేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలు పెంచగా, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లలో విఫలమై రైతులను రెండు వైపులా నష్టపరుస్తోందని అన్నారు. వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతు ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

**పోచమ్మ ఆశీస్సులతో మంచి రోజులు రావాలి**

సిద్దిపేట రూరల్ మండలం తొర్నాలలో నిర్వహిస్తున్న పోచమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. గ్రామస్తులు డప్పు చప్పుళ్లు, హారతులతో ఘన స్వాగతం పలకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రామ దేవత పోచమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండాలని ప్రార్థించారు.తొర్నాల గ్రామ దేవాలయ నిర్మాణానికి తాను ఆర్థిక సహాయం అందించడంతో పాటు గ్రానైట్, సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రి కూడా సమకూర్చినట్లు తెలిపారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, గ్రామ ఆర్చ్ పునర్నిర్మాణం, మొక్కజొన్న పరిశోధనా కేంద్రం, పాలిటెక్నిక్ కళాశాల వంటి అభివృద్ధి కార్యక్రమాలు తమ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. కాళేశ్వరం జలాలు రావడంతో గ్రామంలో వ్యవసాయం అభివృద్ధి చెందినప్పటికీ, ప్రస్తుతం రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికే ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రైతులకు మళ్లీ మంచి రోజులు రావాలని పోచమ్మ తల్లిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

సాగునీటి సమస్యల పరిష్కారానికి శ్రీకారం హరీశ్‌రావు శనివారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. రైతుల సాగునీటి సమస్యలను పరిష్కరించే దిశగా రాఘవపూర్లోని ఇంద్రగూడెం తూము మరమ్మత్తు పనులను హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.వ్యవసాయానికి నీరే ప్రాణాధారమని పేర్కొన్న హరీశ్‌రావు, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా నిరంతరం కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'రైతు డిస్కం' పేరుతో పగటిపూట విద్యుత్ సమస్య వస్తే పావుగంటలో స్పందించిన బీఆర్ఎస్ పాలన ఎక్కడ.. రైతులను గాలికొదిలేసిన ఈ కాంగ్రెస్ పాలన ఎక్కడ అంటూ రైతులు ఆవేదన చెందుతున్నారని హరీష్‌రావు అన్నారు. నంగునూరు మండలం మీదుగా వెళ్తూ మార్గమధ్యలో ముండ్రాయిలో ఆగి రైతులతో ముచ్చటించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు చెప్పుకున్నారు. వారి ఆవేదనను విన్న హరీశ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మండిపడ్డారు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తున్న రైతు డిస్కం వల్ల రైతుల ఉచిత విద్యుత్‌కు ఉరితాడు పడబోతోందన్నారు. రైతు డిస్కంకు సోలార్ పవర్ మాత్రమే కేటాయిస్తారు.. అంటే పొద్దున సూర్యుడు వచ్చిన తర్వాతే మోటార్లు ఆన్ అవుతాయి, సాయంత్రం 5 గంటలకు ఎండ పోగానే మోటార్లు బంద్ అవుతాయి.. దీనివల్ల రైతులకు 7 నుంచి 8 గంటల కరెంటు మాత్రమే వస్తుంది అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇక్కడి భూముల ధర ఎకరాకు రూ.50 లక్షలు పలికేది.. కాంగ్రెస్ పాలనలో పాతాళానికి పడిపోయాయని అన్నారు. రూ.30 లక్షలకు ఇస్తామన్నా కొనే నాథుడు లేడన్నారు. తన కొడుకు పైలట్ చదువు ఫీజు కట్టడానికి భూమి అమ్ముకుందామంటే ఎవరూ కొనట్లేదని స్వయంగా మాజీ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేయడం ఈ ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోందన్నారు.

# గిరిజన గురుకులాలు దేశానికే ఆదర్శం

**మొదటిపేజీ తరువాయి**

ఇస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. నేడు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు రేపు దేశ ఆర్థిక వ్యవస్థకు, రాష్ట్రాభివృద్ధికి, కుటుంబాల ఆర్థిక సాధికారతకు ప్రధాన శక్తిగా మారుతారని అన్నారు. 'జనజాతీయ గరిమ ఉత్సవ్‌బిర్సా లివ్స్ ఇన్ న్యూ భారత'లో భాగంగా బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో శనివారం నిర్వహించిన టీజీటీడబ్ల్యూఆరఈఐఎస్, ఈఎంఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల వార్షిక విజయోత్సవ సభలో మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పరీక్షా ఫలితాల వేడుక మాత్రమే కాదని, గిరిజన విద్యార్థుల ఆత్మవిశ్వాసం, పట్టుదల, ప్రతిభ, సాధికారతకు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు.



**విద్య ద్వారానే సామాజిక న్యాయం**

రాష్ట్రంలో సామాజిక న్యాయం కేవలం నినాదం కాదని, విద్య ద్వారా పేద వర్గాలకు సాధికారత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో విద్యే పేదరిక నిర్మూలనకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి పేద విద్యార్థి ప్రపంచ స్థాయి అవకాశాలు అందుకునేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ఒక విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగం సాధిస్తే కేవలం ఆ కుటుంబం మాత్రమే కాదు.. ఒక తరం అభివృద్ధి చెందుతుందని, వేలాదిమంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అందుకే విద్యారంగంలో ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెడుతోందని చెప్పారు.

**దేశానికి ఆదర్శంగా గిరిజన గురుకులాలు**

తెలంగాణ గిరిజన గురుకులాలు దేశవ్యాప్తంగా ఆదర్శ విద్యాసంస్థలుగా నిలుస్తున్నాయని మంత్రి తెలిపారు. 82 వేల మందికి పైగా విద్యార్థులకు నాణ్యమైన ఉచిత నివాస విద్య అందిస్తున్న ఈ సంస్థలు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నిలుస్తున్నాయని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ ఫలితాల్లో 98.86 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా 56 విద్యాసంస్థలు వంద శాతం ఫలితాలు సాధించాయని తెలిపారు. ఇంటర్‌లో 86.53 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషమన్నారు. జేఈఈ, నీట్, ఈఏపీసెట్ తదితర జాతీయస్థాయి పరీక్షల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారన్నారు.

**ధర్మపురిలో బాలికల సైనిక్ స్కూల్‌కు ప్రతిపాదనలు**

ధర్మపురి నియోజకవర్గంలోని గిరిజన బాలికల కోసం ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు సమగ్ర విద్య అందించే సైనిక్ స్కూల్, డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు త్వరలోనే ఆమోదం లభించనుందని తెలిపారు.

**ఉద్యోగులకు ప్రభుత్వం వరాలు**

గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 1,185 మంది పార్ట్‌టైం ఉద్యోగుల గౌరవ వేతనాల పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. ప్రిన్సిపాల్ గ్రేడ్2 నుంచి గ్రేడ్1 వరకు ప్రమోషన్ అవకాశాలను 70 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ సవరణలు చేపట్టిందన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్స్‌కు నెలకు రూ.5,000 ప్రత్యేక గౌరవ వేతనం, డిప్యూటీ వార్డెన్లకు ప్రత్యేక భత్యం పెంపు, వైస్ ప్రిన్సిపాల్స్‌కు అదనపు ప్రోత్సాహక భత్యాల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వివరించారు.

**మౌలిక వసతులకు భారీ నిధులు**

గురుకులాల్లో విద్యార్థులకు మరిన్న మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. రూ.72.83 కోట్లతో మరమ్మతులు, నిర్వహణ పనులకు అనుమతులు మంజూరు చేసినట్లు, ఆధునిక మాడ్యులర్ కిచెన్ల ఏర్పాటుకు రూ.25 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలన్న లక్ష్యంతో అన్ని విద్యాసంస్థలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి 'ఈట్ రైట' సర్టిఫికేషన్ సాధించినట్లు చెప్పారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.565.32 కోట్లు విడుదల చేశామన్నారు.

**పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం**

విద్యార్థులను ప్రపంచస్థాయి అవకాశాలతో అనుసంధానించేందుకు పలు ప్రముఖ జాతీయ, సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని మంత్రి తెలిపారు. సీఎస‌ఐఆర్‌ఐఐసీటీతో కలిసి రీసెర్చ్, ట్రైనింగ్, అకడమిక్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గాంధీ మెడికల్ కాలేజ్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ భాగస్వామ్యంతో రూ.1.30 కోట్లతో అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రజాగాయకుడు నరసయ్య (నల్గొండ గద్దర్) ఆలపించిన అంబేద్కర్ గీతం విద్యార్థులను ఉత్తేజపరిచింది. గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థ ల్లో ఎస‌ఎస్‌సి, ఇంటర్, ఐఐటి, జేఈఈ, నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన, అలాగే విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను మంత్రులు మెమెంటోల,T శాలువలతో నగదు పురస్కారాలు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ ఇన్‌చార్జి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ, విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, వెడ్మా బొజ్జు, టీజీటీడబ్ల్యూఆరఈఐఎస్ కార్యదర్శి సీతాలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, టీసీఆర్ అండ్ టీఐ డైరెక్టర్ డాక్టర్ సముజ్వల, సీఎస‌ఐఆర్‌ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

**విద్యార్థులకు మంత్రి సీతక్క అభినందన**

మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని సాధారణ పాఠశాలలను అధిగమించి అద్భుత ఉత్తీర్ణత శాతం సాధిస్తున్న విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానన్నారు. గిరిజన ప్రాంతాల గురించి మాట్లాడినప్పుడు అక్షరాస్యతలో వెనుకబడి ఉంటారని చాలామంది భావిస్తారు. అది గతంలో.. ఇప్పుడు పరిస్థితులు మారాయి.. ఈసారి టెన్త్ ఫలితాల్లో ములుగు జిల్లా 99.30 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. గతసారి ఇంటర్ ఫలితాల్లో మొదటి స్థానం సాధించాం. ఈసారి రెండో స్థానంలో నిలిచాం. ఇంకా మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలి అని సూచించారు. మహబూబాబాద్, ములుగు, ఆసిఫాబాద్ వంటి గిరిజన జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో మంచి ఫలితాలు రావడం సంతోషకరమన్నారు. ములుగు జిల్లా సాధించిన అద్భుత ఫలితాలు ఒక ఆదివాసి బిడ్డగా నాకు ఎంతో గర్వాన్ని కలిగిస్తున్నాయన్నారు. ఈసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చరిత్ర సృష్టించారన్నారు. చెంచుపెంటల్లో, దళితవాడల్లో, గిరిజన తండాల్లో మీ విజయాల గురించి చర్చ జరిగితే అక్కడి పిల్లలు కూడా ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని ముందుకు సాగుతారు. సమాజంలో అసమానతలు తగ్గి అందరికీ సమాన అవకాశాలు లభించే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని మంత్రి సీతక్క విద్యార్థులకు ఉద్బోధించారు.

# పేదవాని గుమ్మం వద్దకు ప్రభుత్వ పథకాలు

**మొదటిపేజీ తరువాయి**

పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గత బీఆరఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఉంటే ఇళ్లు 3040 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని, ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని, ఇది పేదలకు పెద్దన్న, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని వివరించారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే తదితర శాఖలు ఒకేచోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామన్నారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్.నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, డీఐజీ కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ - గోల్కొండ కార్యాలయాలు వస్తాయని, వీటివల్ల ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయని చెప్పారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ సునీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు


**మొదటిపేజీ తరువాయి**

సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి ద యాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదం డరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయ క్, మోతే శోభన్ రెడ్డిలు సంబంధిత ఉన్నతాధి కారులతో జరిపిన ఈ సమావేశంలో విధివిధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. ఉద్యమ కారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం కమిటీ వేస్తూ ఈ నెల 15న జీవో 679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ కమిటీ సచి వాలయంలో మొదటిసా రి సమావేశమైంది. జూన్ 4న అన్ని పార్టీల ప్రతి నిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని నిర్ణయించింది. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశలలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్య మకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీసు కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్లు, విద్యార్థులు, ఆర్టీసీ, సింగరేణి కార్మికులు అందరినీ గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమ కారులకు ప్రభుత్వం తరపున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫారసులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్య మంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలనేది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, జీఏడీ ప్రొటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# తగ్గని ఎండల తీవ్రత

**హైదరాబాద్, మే30, సిరి న్యూస్:**

రాష్ట్రంలో ఎండలకు తోడు, వడగాలులు కూడా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అడపాదడపా కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు పడుతున్నా, మొత్తంగా ఎండలు మాత్రం శాంతించడం లేదు. రుతుపవానలు కూడా ఆలస్యం అవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావంతో జూన్ 1 నుంచి అక్టోబర్ వరకు నైరుతి సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు లేవని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో భిన్నవాతావరణం కొనసాగుతున్నది. తెల్లవారుజామున, రాత్రివేళలో వర్షం కురుస్తుండగా.. మిగతా సమయంలో ఎండలు దంచికొడుతున్నాయి. 17 జిల్లాల్లో 45 డిగ్రీలకుపై గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్,



నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో వర్షపాతం కొద్దిగా ఆశించినస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. వాతావరణంలో నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకొంటూ, పంటల ప్రణాళికలను రూపొందించు కోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. 2026 నైరుతి రుతుపవనాల కాలానికి సంబంధించిన తుది దీర్ఘకాలిక వాతావరణ అంచనాలను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు మధ్య తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్టు వెల్లడించింది. ఈ వర్షాలు భూగర్భ జలవనరుల పునరుద్ధరణకు ఎంతో ఉపయోగపడుతాయని వివరించింది. సంవత్సరం వానకాలం ఎల్‌నినో ప్రభావంతో 2018 మాదిరిగానే ఉంటుందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. 2025 సంవత్సరం మాదిరి వర్షాలను ఆశించవద్దని తెలంగాణ వెదర్‌మ్యాన్ సూచించారు. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షాలు ఉంటాయని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణంకంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అంచనా వేశారు. అయినప్పటికీ.. 201415లా సాధారణ వర్షపాతం 905.4 మి.. కురువాల్సి ఉండగా కేవలం 562.1 మి.. కురిసినంత తీవ్రంగా ఉండకపోవచ్చని తెలిపారు. గత 56 సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం రుతుపవన వర్షాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఏడాది దక్షిణ, ఉత్తర జిల్లాల్లో వర్షాల లోటు తీవ్రంగా ఉంటుందని, మధ్య తెలంగాణలో మంచి వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఈ ఏడాది రెండో వారంలో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ఆరంభం ఉంటుందని చెప్పారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత.



**సదాశివపేట. మే 30. (సిరి న్యూస్)**

సదాశివపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేయడం జరిగింది. సదాశివపేట మండలంలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన ఖలీల్ రెహమాన్ కూతురు ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ చెక్కు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ చేతులమీదుగా ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి మాధవరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సహకారంతో పేదవారికి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, మాజీ సర్పంచ్ కరుణాకర్, రాజశేఖర్ రెడ్డి, రమేష్, విట్టల్ రెడ్డి, నిజాంపూర్ గ్రామ వార్డు మెంబర్ నరేష్, మురళి, గ్రామంలోని టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సదాశివపేటలో సామ్ ట్రస్ట్ చారిటీ, వెల్ఫేర్ ఆధ్వర్యంలో వేసవి శిబిరం.




**సదాశివపేట. మే 30. (సిరిన్యూస్)**

సదాశివపేట ప్రధాన కార్యాలయంలో సామ్ ట్రస్ట్ చారిటీ, వెల్ఫేర్ ఆధ్వర్యంలో సంస్థ బాలికల కోసం వేసవి శిక్షణా తరగతులను నిర్వహించింది, ఇందులో వందలాది మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో మెహందీ డిజైన్లతో పాటు బ్యూటీషియన్ నైపుణ్యాలు, మేకప్, హెయిర్ స్టైలింగ్, దుపట్టా కట్టుకునే విధానాలపై శిక్షణ అందించబడింది. అంతేకాకుండా జూమ్ యాప్ ద్వారా పిల్లల ఆరోగ్యం, పోషణకు సంబంధించిన ఒక ప్రత్యేక ప్రత్యక్ష వెబినార్ కూడా ప్రదర్శించబడింది.జూన్ 8, 2026 నుండి, అంతర్జాతీయ యోగా గురువుల సేవలతో కూడిన 21 రోజుల ఆన్‌లైన్ ఉచిత యోగా తరగతులు ప్రారంభించబడును. మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ సామ్ ట్రస్ట్ చారిటీ, వెల్ఫేర్ అధ్యక్షులు షేక్ అంజుమ్, ఆ ట్రస్ట్ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వారికి వివరించారు. ఎవరికైనా సహాయం అవసరమైతే ట్రస్ట్‌ను సంప్రదించాలని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరికీ సహాయం చేయడానికి సాధ్యమైనంత కృషి చేయబడుతుంది.సంప్రదించండి: 88976 91814.

## క్రీడా స్ఫూర్తితోనే విజయాలు సాధ్యం

### ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**రామచంద్రపురం,(పటాన్ చెరు), మే 30 (సిరి న్యూస్):**

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకున్నప్పుడే జీవితంలో విజయాలు సాధించడం సాధ్యమవుతుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం భానూరు గ్రామంలో నిర్వహిస్తున్న పీపీఆర్ వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. గెలుపు–ఓటములను సమానంగా స్వీకరించే గుణాన్ని క్రీడలు నేర్పుతాయని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని అందిస్తాయని పేర్కొన్నారు.నేటి యువత మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువ సమయం కేటాయించకుండా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కూడా సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, క్రీడా మైదానాల ఏర్పాటు, క్రీడా పోటీల నిర్వహణ ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువత తమ ప్రతిభను చాటుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పటాన్‌చెరు పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడాకారులు, టోర్నమెంట్ నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇంధన దోపిడీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుమ్మక్కు

- **జనం జేబులు గుల్ల చేయడంలో బీజేపీ, కాంగ్రెస్‌లది ఒకే తీరు**
- **ధరలు పెంచుతూ కేంద్రం.. వ్యాట్ తగ్గించకుండా రాష్ట్రం**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



**సంగారెడ్డి, సిరి న్యూస్:**

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ కుమ్మక్కై ఇంధన ధరల పేరిట ప్రజలను నిలువునా దోచుకుంటున్నాయని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అడ్డగోలుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతుంటే, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర పన్నులు తగ్గించకుండా ఆ దోపిడీలో భాగస్వామి అవుతోందని ఆరోపించారు. మాటల్లో ప్రజా సంక్షేమం గురించి గొప్పలు చెప్పే ఈ రెండు ప్రభుత్వాలు, ఇంధన ధరలపై పన్నులు తగ్గించే విషయంలో మాత్రం ముందుకు రావడం లేదని విమర్శించారు. వారంలో నాలుగు సార్లు ఇంధన ధరలను పెంచి కేంద్రం అదనపు భారం మోపితే, కేంద్రం పెంచిన ప్రతి రూ.7.50లో సుమారు రూ.2.50 రాష్ట్రం వ్యాట్ రూపంలో వసూలు చేస్తోందని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో పెట్రోల్‌పై సుమారు 35 శాతం, డీజిల్‌పై 27 శాతం రాష్ట్ర పన్నులే ఉన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేస్తున్న ఈ దోపిడీ కారణంగా తెలంగాణ ప్రజలపై నెలకు సుమారు రూ.162 కోట్లు, ఏడాదికి దాదాపు రూ2వేల కోట్ల అదనపు భారం పడుతోందన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఇంధన ధరలపై గగ్గోలు పెట్టిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం 0.1 శాతం వ్యాట్ కూడా ఎందుకు తగ్గించలేదని చింత ప్రభాకర్ ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వల్ల రవాణా రంగం సంక్షోభంలో పడి, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పొలం దున్నాలన్నా, సామాన్యులు వాహనాలు నడపాలన్నా భయపడే పరిస్థితి నెలకొందన్నారు. నిజంగా సీఎం రేవంత్ రెడ్డికి సామాన్యుల పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పెట్రోల్, డీజిల్‌పై కనీసం 10 శాతం రాష్ట్ర వ్యాట్ తగ్గించి ఉపశమనం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పెట్రోల్ ధరలపై విమర్శలు చేసే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. తెలంగాణ ప్రభుత్వ వ్యాట్ విధానంపై ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నిలదీశారు.

# కోడూరు శరత్ చంద్ర ఓ రక్తదాత.

- **2004 నుండి ఇప్పటివరకు 42 సార్లు రక్తదానం.**
- **ఆపదలో ఉన్న వారికి తన మన తేడా లేకుండా రక్తదానం.**
- **తనలో ప్రాణం ఉన్నంత వరకు రక్తదానం ఇస్తూనే ఉంటాను.**
- **అన్న ఫౌండేషన్ కోడూరి శరత్ చంద్ర.**



**సదాశివపేట. మే 30. (సిరి న్యూస్)**

ఎక్కడ రక్త దానం కావాలన్నా ముందుండే వ్యక్తి , సమాజ సేవకుడు కోడూరి శరత్ చంద్ర సదాశివపేటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో ఒక పేషెంట్ కు అత్యవసరంగా రక్తం అవసరం ఉందని తెలుసుకొని కోడూరి శరత్ చంద్ర వెంటనే స్పందించి ఆసుపత్రికి వెళ్లి రక్తం ఇవ్వడం జరిగింది. కోడూరు శరత్చంద్ర ఈ విధంగా 2004 నుండి ఇప్పటివరకు 42 సార్లు రక్తదానం ఇచ్చారు. అంతేకాకుండా 2016లో అన్నా ఫౌండేషన్ను స్థాపించి ఈ ఫౌండేషన్ ద్వారా అనేక సమాజసేవ కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. కోడూరి శరత్ చంద్ర మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి తన మన తేడా లేకుండా రక్త దానం ఇవ్వటం జరుగుతుందని, తనలో ప్రాణం ఉన్నంతవరకు రక్తదానం ఇస్తూనే ఉంటానని అన్న ఫౌండేషన్ చైర్మన్ కోడూరి శరత్ చంద్ర తెలిపారు. అన్న ఫౌండేషన్ ద్వారా రక్తదాన కార్యక్రమాలు,అన్నదాన కార్యక్రమాలు, పేదవారి పెళ్లిళ్లకు పుస్తె మెట్టెలు ఇవ్వడంలో అన్న ఫౌండేషన్ ముందు ఉండుంటుందని, సమాజ సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిర్వహిస్తూనే ఉంటామని అన్నారు.





## 17వ వార్డులో ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు ఫేషియల్ రికగ్నిషన్ కార్యక్రమం విజయవంతం.

**సదాశివపేట. మే 30. (సిరిన్యూస్)**

సదాశివపేట పట్టణంలోని 17వ వార్డులో ఆసరా పెన్షన్ లబ్ధిదారుల కోసం శనివారం నాడు ప్రత్యేకంగా ఫేషియల్ రికగ్నిషన్ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. పిట్టలకేరి వేపచెట్టు సమీపంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పెద్ద సంఖ్యలో పెన్షన్ లబ్ధిదారులు హాజరై తమ వివరాలను ధృవీకరించుకున్నారు.వృద్ధులు, వికలాంగులు ఇతర పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి, సిబ్బంది సహకారంతో కేవైసీ ప్రక్రియను పూర్తి చేయించారు.ఈ సందర్భంగా 17 వ కౌన్సిలర్ సజ్జి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్ సేవలు నిరంతరంగా అందుకోవాలంటే ప్రతి లబ్ధిదారుడు తప్పనిసరిగా ఫేషియల్ రికగ్నిషన్, కేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై ప్రక్రియ పూర్తి చేసుకోలేని వారు తమ ఆధార్ కార్డు తీసుకొని జూన్ 15వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయంలో కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సిబ్బంది మరియు పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



# వారు అందించిన సేవలు మరువలేనివి!

- **ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజం**
- **మచ్చలేని సర్వీసుతో మన్ననలు పొందడం అభినందనీయం**
- **జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి**
- **ఎస్ఐ అంజిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వీరప్పలకు ఘన సత్కారం**
- **సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు**



**సంగారెడ్డి, సిరి న్యూస్:**

ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ అనేది సహజమని, అయితే వారు అందించిన సేవలు మాత్రం మరువలేనివని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ కొనియాడారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో ఎస్ఐ అంజిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వీరప్పలకు జిల్లా ఎస్పీతో పాటు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి (ఐపీఎస్) ఘనంగా సత్కరించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. 1989లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా నియామకమైన అంజిరెడ్డి, ఉమ్మడి జిల్లాలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో అత్యంత ధైర్యసాహసాలతో విధులు నిర్వహించారని గుర్తుచేశారు. జిల్లా క్రైమ్ రికార్డు బ్రాంచ్‌లో సుదీర్ఘకాలం సేవలందించి, తన సర్వీస్ మొత్తంలో ఎలాంటి ప్రతికూల రిమార్క్ లేకుండా అంచెలంచెలుగా సబ్–ఇన్‌స్పెక్టర్ స్థాయికి ఎదగడం ఆయన అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే, 1993లో ఆర్మ్డ్ రిజర్వ్ సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా చేరిన వీరప్ప సేవలను ఎస్పీ ప్రశంసించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వర్తిస్తూ, ఎలాంటి రిమార్క్ లేకుండా హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందడం ఆయన నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో సుదీర్ఘ కాలం పాటు పనిచేస్తూ అధికారుల మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. పదవీ విరమణ పొందుతున్న అధికారులు ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని వారు ఆకాంక్షించారు. పోలీసు శాఖ తరపున వారికి, వారి కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్ఐ సురేష్, డీసీఆర్‌బీ ఎస్ఐ కావేరి తదితర పోలీసు సిబ్బందితో పాటు పదవీ విరమణ పొందుతున్న అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సంపాదకీయం

# భారత ఆర్థిక వ్యవస్థకు ద్విముఖ సవాలు !



ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ ఒక సంక్లిష్టమైన జంట సవాలును ఎదుర్కొంటోంది. ఒకవైపు అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ నిరంతరం క్షీణిస్తుండటం, మరోవైపు దేశీయంగా ఆర్థిక వృద్ధి రేటు (జీడీపీ) మందగించడం దేశ ఆర్థిక సుస్థిరతపై ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఈ రెండు అంశాలు వేర్వేరుగా కనిపిస్తున్నప్పటికీ, అంతర్గతంగా ఒకదానితో ఒకటి ముడిపడి దేశ ఆర్థిక చక్రాన్ని నెమ్మదింపజేస్తున్నాయి. ఆర్థికశాస్త్ర పరంగా రూపాయి విలువ పడిపోవడం, ఆర్థికవృద్ధి మందగించడం అనేవి ఒకదానికొకటి తోడై దేశ ఆర్థిక వ్యవస్థను ఇరుకున పెడతాయి. రూపాయి విలువ తగ్గినప్పుడు, మనం విదేశాల నుండి దిగుమతి చేసుకునే ముడి చమురు, గ్యాస్, ఎలక్ట్రానిక్స్, రసాయనాల ధరలు భారంగా మారుతాయి. పెరిగిన ఇంధన, ముడిసరుకుల ధరల వల్ల దేశీయ పరిశ్రమల ఉత్పాదక వ్యయం పెరుగుతుంది. ధరలు పెరగడంతో సాధారణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గి, మార్కెట్లో వస్తువుల డిమాండ్ పడిపోతుంది. డిమాండ్ తగ్గడం వల్ల పరిశ్రమల విస్తరణ ఆగిపోయి, అల్టిమేట్‌గా దేశ ఆర్థిక వృద్ధి క్షీణిస్తుంది.

**అంతర్జాతీయ ఒత్తిళ్లు...**

అమెరికా సెంట్రల్ బ్యాంక్ (ఫెడరల్ రిజర్వ్) వడ్డీ రేట్లను పెంచిన ప్రతిసారీ, విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుండి తమ డబ్బును ఉపసంహరించుకుని అమెరికా వైపు మళ్లుతున్నారు. ఇది రూపాయిపై తీవ్ర ఒత్తిడిని తెస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న యుద్ధాలు, అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల గ్లోబల్ సప్లై చైన్ (సరఫరా గొలుసు) దెబ్బతిని, ముడి చమురు ధరలు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. ఇది భారతదేశ కరెంట్ అకౌంట్ లోటును పెంచుతోంది. మరోవైపు దేశ జనాభాలో అత్యధిక భాగం ఆధారపడిన వ్యవసాయ రంగంలో ఆదాయాలు స్థిరంగా లేకపోవడం, యువతలో ఉపాధి లేమి వల్ల దేశీయంగా ప్రజా వినియోగం మందగించింది. బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిల భయం పూర్తిగా తొలగకపోవడం, మార్కెట్లో స్పష్టమైన డిమాండ్ లేకపోవడంతో ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు కొత్త ప్రాజెక్టులలో భారీ పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజ వేస్తున్నాయి. ఈ జంట సవాళ్ల నుండి దేశ ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించడానికి ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ సమన్వయ వ్యూహంతో ముందుకు వెళ్లాల్సి ఉంది.

**మౌలిక వసతుల కల్పన పెంచాలి...**

ప్రభుత్వం రోడ్లు, రైల్వేలు, పోర్టులు వంటి మౌలిక వసతుల ప్రాజెక్టులపై ప్రభుత్వ వ్యయాన్ని మరింత పెంచాలి. ఇది తక్షణమే ఉపాధిని సృష్టించి, మార్కెట్లో డబ్బు చలామణిని పెంచుతుంది. రూపాయి పతనానికి ప్రధాన కారణమైన ముడి చమురు దిగుమతులను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ హైడ్రోజన్, సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరుల వైపు వేగంగా అడుగులు వేయాలి. కేవలం సేవల రంగంపైనే కాకుండా, తయారీ రంగంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేలా 'మేక్ ఇన్ ఇండియా' పరిధిని విస్తరించాలి. స్థానిక ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా విదేశీ మారక నిల్వలను పెంచుకోవచ్చు. డాలర్‌తో ముడిపడి ఉన్న నష్టాలను అధిగమించడానికి మిత్రదేశాలతో ద్వైపాక్షిక వాణిజ్యాన్నిసొంత కరెన్సీల (రూపాయి) ద్వారా జరిపే ఒప్పందాలను మరింత బలోపేతం చేయాలి. రూపాయి పతనం, ఆర్థిక మందగమనం అనేవి తాత్కాలిక సంక్షోభాలు మాత్రమే కావు, ఇవి మన ఆర్థిక వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రకృతి ఇస్తున్న సంకేతాలు. సంక్షేమ పథకాలతో పాటు సమాంతరంగా సంస్కరణలను వేగవంతం చేసి, అంతర్గత డిమాండ్‌ను పెంచడం ద్వారానే భారతదేశం ఈ గ్లోబల్ తుఫానును తట్టుకుని స్థిరమైన వృద్ధి పథంలో దూసుకుపోగలదు.

ఎ.సి.ఎస్ .రావు

# 2 టన్ను కెపాసిటీ రైస్ మిల్లులకు అనుమతి ఇవ్వాలి

**పైడి శ్రీధర్ గుప్తా**

నర్సాపూర్ మే 30 (సిరి న్యూస్)

కేంద్ర ప్రభుత్వం వెంటనే రైతుల వద్ద ఉన్న వరి ధాన్యం కొనుగోలు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పైడి శ్రీధర్ గుప్త డిమాండ్ చేశారు, శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు, కేంద్రాలలో రెండు నెలలుగా వరి ధాన్యం కుప్పలు నిల్వలు ఉండడం వర్షాలు కురవడంతో ధాన్యం తడిసిపోయి తరుగు పేరుతో రైతులకు నష్టం జరుగుతుందని ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించరాదని, రాష్ట్రంలో 2 టాన్ కెపాసిటీ గల రైస్ మిల్లులు సుమారుగా 2000 నుండి 3000 వరకు ఉంటాయని వాటికి అనుమతిస్తే ధాన్యం వేగంగా కొనుగోలు జరిగి రైతులకు మేలు జరుగుతుందని తెలంగాణలో ఉన్న అన్ని రైస్ మిల్లులకు వడ్లు కొనుగోలు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు, రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వము కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు



# రామాయంపేట మున్సిపాలిటీలో అవినీతిపై కలెక్టర్‌కు బీజేపీ ఫిర్యాదు.

రామాయంపేట, మే 30 (సిరి న్యూస్)

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై శనివారం మెదక్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, రామాయంపేట పట్టణ అధ్యక్షులు అవినాష్ రెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాయంపేట మున్సిపాలిటీ నిధులతో 2006 సంవత్సరంలో నిర్మించిన 13 దుకాణ సముదాయం లీజు గడువు 2026 నాటికి 20 సంవత్సరాలు పూర్తయినప్పటికీ, మున్సిపల్ పాలకవర్గం, మున్సిపల్ కమిషనర్ కుమ్మక్కై నూతన రీ–టెండర్ ప్రక్రియ నిర్వహించకుండా కొనసాగించడం వల్ల మున్సిపాలిటీకి భారీ ఆర్థిక నష్టం కలుగుతోందని ఆరోపించారు. ఒకవేళ పారదర్శకంగా రీ–టెండర్ నిర్వహించినట్లయితే రామాయంపేట మున్సిపాలిటీకి సుమారు రూ. 3 కోట్ల నుండి రూ. 5 కోట్ల వరకు అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందని, ఈ విషయాన్ని



అనేకసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు.అలాగే గతంలో 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల కింద వచ్చిన సుమారు రూ. 3 కోట్లలో దాదాపు రూ. 1.60 కోట్ల మేర నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు ఉన్నాయని, ఈ అంశాన్ని కూడా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటి వరకు విచారణ జరిపి సంబంధిత మొత్తాన్ని రికవరీ చేయకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. దీనికి తోడు ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ఖర్చుల పేరిట సుమారు రూ. 30 లక్షల వ్యయం చూపించి అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి 2006లో నిర్మించిన 13 షాపుల లీజు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, వెంటనే పారదర్శకమైన రీ–టెండర్ ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు. అలాగే 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల వినియోగంపై ప్రత్యేక విచారణ కమిటీని నియమించి, దుర్వినియోగమైనట్లు ఆరోపణలు ఉన్న రూ. 1.60 కోట్లను రికవరీ చేయాలని, మున్సిపల్ ఎన్నికల ఖర్చుల పేరుతో జరిగిన ఆర్థిక అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ప్రజాధనాన్ని కాపాడాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మాజీ సర్పంచ్, ప్రధాన కార్యదర్శి అనిల్, యువమోర్చా నాయకుడు కటికే కార్తిక్, నితిన్, పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్ లు.



- **అనాధ శవానికి అంత్యక్రియలు.**

రామాయంపేట, మే 30 (సిరి న్యూస్)

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో అనాధ శవానికి అంతక్రియలు చేసిన మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు...శనివారం రోజున ఎరుకలి విజయ రామాయంపేట పట్టణానికి చెందిన ఆమె కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఆమె గుడిసెలో చనిపోవడం జరిగింది, విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా ఆదేశాల మేరకు మున్సిపాల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు అంత్యక్రియలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గజవాడ నాగరాజు,దేవుని రంజిత్, పుట్టి సందీప్, గుగులోత్ రవి,కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల యాదగిరి, పోచమ్మల గణేష్ ,దాకి స్వామి ,తోంటావాలి యాదగిరి, సాల్మన్ రాజు, తాహెర్ భాయ్, ఎల్లం, చిలుక విరాట్, పోచమ్మల భాను, సుధీర్ గౌడ్, అక్కల నరేందర్, దేవుని నరేష్, సోహెల్ , కారు టాక్సీ డ్రైవర్ యూనియన్ సభ్యులు మరియు మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మూగ జీవాల గర్భాల్లో కాలుష్య విషం

- **కలుషిత నీరు తాగి గేదెకు గర్భస్రావం**
- **కట్ట తెంపిన అయ్యమ్మ చెరువు**
- **ఊళ్లను ముంచెత్తిన వ్యర్థాలు**
- **మూగ జీవాల విలవిల**
- **అధికారుల నిర్లక్ష్యానికి ఇది చాలదా**

జిన్నారం మే 30 సిరి న్యూస్

గడ్డపోతారం పురపాలిక పరిధిలోని అయ్యమ్మ చెరువు కట్ట తెంపడం వల్ల అందులో ఉండే వ్యర్థ జలాలు బయటకు వదలడంతో కాజిపల్లి ధర్మి చెరువు నిండి విషపు జలాలు బయటకు రావడం ఎండకు తట్టుకోలేక ఆ నీళ్లు పశువులు తాగడం వల్ల కాజిపల్లికి చెందిన రైతు చిట్ల జగన్ కు



చెందిన మూగ జీవానికి కడుపు కోత, తన జీవనధారమైన గేదకు ఇలా జరగడంతో కన్నీరు మున్నీరవుతున్నాడు. ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ఆయన వేడుకున్నారు. గ్రామాలలో పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి మిగిలిన మూగజీవాలను కాపాడాలని ఆయన ఉన్నత అధికారులను కోరారు.

**బాధిత రైతు ఆవేదన:**



అయ్యమ్మ చెరువు కట్ట తెంపడం వల్ల ఆ కలుషిత నీరు బయటకు రావడంతో చుట్టుపక్కల గ్రామాలు విలవిలలాడుతున్నాయి, వృద్ధులకు చిన్నారులకు శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కలుషిత వరద జలాలను తాగిన పాడి గేదెలు అస్వస్థకు గురై గర్వస్రావం జరుగుతున్నవి అని తక్షణమే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బొల్లారంలో కెమికల్స్ డ్రమ్స్ స్వాధీనం

- **ఎలాంటి పత్రాలు లేకుండా రసాయనాల రవాణా**
- **టాస్క్ ఫోర్స్ చేతికి చిక్కిన కెమికల్స్ లోడ్ రసాయనాల గుట్టురట్టు టాస్క్ ఫోర్స్ యాక్షన్**

జిన్నారం మే 30 సిరి న్యూస్

బొల్లారం పారిశ్రామిక ప్రాంతం లో నిఘా పెట్టిన పిసిబి టాస్క్ ఫోర్స్ అధికారులు, పరిశ్రమలకు చెందిన వ్యర్ధ రసాయనాల లోడ్ తో వెళ్తున్న డీసీఎం ను శనివారం సాయంత్రం ఆసానికుంట ప్రాంతంలో పిసిబి ఎన్విరాన్మెంట్ అధికారి చక్రపాణి బృందంతో కలిసి పట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా కెమికల్ వ్యర్థాలను తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించమని తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా డీసీఎం లో తరలిస్తున్న 39 డ్రమ్ములు పట్టుకోవడం జరిగింది, అని అన్నారు.డ్రమ్ముల్లో నిలువచేసిన వ్యర్ధ రసాయనాల షాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపియడం జరిగింది, అని తెలిపారు.ఐదు రోజుల్లో రిపోర్టుల ఆధారంగా ఏ పరిశ్రమకు చెందినవి, ఈ కెమికల్ అని గుర్తించి ఆ పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# సమస్యలు పరిష్కరించండి కొనసాగుతున్న నిరసన.

రామాయంపేట, మే 30 (సిరి న్యూస్)



తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకెపి వివో ఏ నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. రామాయంపేట ఐకెపి భవన్ వద్ద 14వ రోజు వినూత్న రీతిలో మోకాలి పై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేసి తమను ఆదుకోవాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

# ఘనంగా జగదాంబ సేవలాల్ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు.

**హాజరైన కంటారెడ్డి తిరుపతిరెడ్డి.**

రామాయంపేట, ( నిజాంపేట)మే 30 (సిరి న్యూస్)

నిజాంపేట మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి గ్రామంలో శనివారం జగదాంబ సేవలాల్ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం జగదాంబ సేవలల్ మహారాజ్ కళ్యాణ మహోత్సవాన్ని తాండావాసులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు అనంతరం నిర్వాహకులు ఆయన శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలలో ఆలయాలు ఏర్పాటు చేసుకుని గ్రామస్తులంతా ఒకే చోట చేరుకొని ఆ భగవంతుని ప్రార్థించుకోవడం సంతోషకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల గ్రామంలో ఒక ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని గ్రామస్తులంతా భక్తి మార్గంలో



పయనించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఆ జగదాంబ సేవలాల్ మహారాజ్ దయవల్ల మండల ప్రజలు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నాగరాజు, యూత్ అధ్యక్షులు మావరం రాజు, రాజు నాయక్,గోపరి నర్సింలు, నరేందర్ నాయక్, విట్టల్ నాయక్, రెడ్డి శెట్టి రవీందర్, వినయ్, నగేష్ ఎల్లం యాదవ్,దుర్గయ్య, భరణి గౌడ్, మాధవరెడ్డి, మండల ముఖ్య నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాలు, పండ్లు కలిపి తింటే డేంజర్..?



**చాలామంది ప్రతిరోజూ పాలు తాగుతూ ఉంటారు.పాలు ఆరోగ్యానికి చాలా మంచిది. పాలను తీసుకోవడం వలన క్యాల్షియం బాగా అందుతుంది.ఎముకలు ఆరోగ్యంగా దృఢంగా ఉంటాయి.**

అయితే పాలు తీసుకునేటప్పుడు మాత్రం కొన్ని పొరపాట్లు చేయకూడదు.పాలు తాగేటప్పుడు కొన్నిఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని ఆరోగ్య నిపుణులుహచ్చరిస్తున్నారు.మరి అవేంటో తెలుసుకుందాం.

పాలు తాగేటప్పుడు పాలతో పాటు అరటిపండు తీసుకోవడం మంచిది కాదు. ఈ రెండు కాంబినేషన్ మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండిటిని కలిపి ఒకేసారి తీసుకుంటే జీర్ణ సమస్యలు వస్తాయి.కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు కూడా కలుగుతాయి. అలాగే పాలతో పాటుగా సిట్రస్ పండ్లను తినడం కూడా మంచిది కాదు. సిట్రస్ పండ్లను పాలతో పాటు తీసుకోవడం వలన జీర్ణ సమస్యలు కలుగుతాయి. పాలతో పాటు వాటర్ కంటెంట్ ఉండే పుచ్చకాయ వంటి పండ్లను తీసుకోవద్దు. దీని వలన గ్యాస్ అతిసారం వంటి సమస్యలు వస్తాయి.

పాల కన్నా పండ్లు త్వరగా జీర్ణం అవుతాయి. పాలు నెమ్మదిగా జీర్ణం అవుతాయి. అదే సమయంలో రెండింటినీ కలిపి తీసుకోవడం వల్ల జీర్ణాశయంలో పండ్లు పులిసినట్లు అవుతాయి. దీంతో గ్యాస్ ఏర్పడుతుంది. కడుపు ఉబ్బరం వస్తుంది. పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుంది. కొన్ని రకాల పండ్లు సహజంగానే ఆమ్ల స్వభావాన్ని కలిగి ఉంటాయి. అలాంటి పండ్లను పాలతో కలిపి తీసుకుంటే జీర్ణ వ్యవస్థలో ఇంకా ఇబ్బంది కలుగుతుంది. పొట్టలో ఆమ్లాల్లో అసమతుల్యత ఏర్పడుతుంది. దీంతో ఆహారం భారంగా మారుతుంది. జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. అజీర్తి ఏర్పడుతుంది. గుండెల్లో మంట వస్తుంది. పొట్టలో అసిడిటీ కూడా పెరుగుతుంది. పాలు, పండ్లలో అనేక పోషకాలు ఉంటాయన్న సంగతి తెలిసిందే. అయితే ఆ పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకోవాలంటే వీటిని ఎట్టి పరిస్థితిలోనూ కలిపి తీసుకోకూడదు. పాలను, పండ్లను తీసుకునేందుకు కనీసం 2 గంటల వ్యవధి ఉండాలి. రెండింటినీ కలిపి తీసుకుంటే వీటిల్లో ఉండే పోషకాలు ఒకదానికొకటి అడ్డుపడతాయి. దీంతో ఏ పోషకాలను కూడా శరీరం శోషించుకోలేదు. అలాంటప్పుడు వీటిని తీసుకుని కూడా ప్రయోజనం ఉండదు. పైగా పొట్టలో అసౌకర్యం ఏర్పడి జీర్ణ సమస్యలు వస్తాయి. అలాగే పాలు, పండ్ల మిశ్రమం ఆయుర్వేద ప్రకారం శరీరంలో ఆమాన్ని పెంచుతుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. జీర్ణక్రియ నెమ్మదిగా సాగుతుంది. శరీరంలో జీర్ణం కాని ఆహారాలు కొవ్వుగా మారుతాయి. దీంతో బరువు పెరుగుతారు. శరీరరంలో ఆమం చేరి దీర్ఘకాలంలో హాని కలగజేస్తుంది. గుండె జబ్బులకు కారణం అవుతుంది. పాలు, పండ్లను కలిపి తీసుకోవడం వల్ల కొందరికి అలర్జీలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ రెండూ కొందరి శరీరంలో టాక్సిన్‌గా మారే ప్రమాదం ఉంటుంది. దీంతో ఫుడ్ పాయిజనింగ్ కూడా జరగవచ్చు. పాలు, పండ్ల మిశ్రమాన్ని తరచూ తీసుకోవడం వల్ల అధికంగా బరువు పెరుగుతారు. శరీరం పోషకాలను శోషించుకునే శక్తిని క్రమంగా కోల్పోతుంది. దీంతో పోషకాహార లోపం ఏర్పడుతుంది. అలాగే పండ్లలో ఉండే విటమిన్ సి పాల వల్ల శరీరానికి లభించదు. దీంతో రోగ నిరోధక వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుంది. పాలు, పండ్లను కలిపి తీసుకుంటే శరీరంలో కఫం అధికంగా తయారవుతుంది. ఇది ముక్కు దిబ్బడ, దగ్గు, జలుబు, బ్రాంకైటిస్ వంటి సమస్యలను కలగజేస్తుంది. కనుక ఆయుర్వేద ప్రకారం పాలు, పండ్లను ఎట్టి పరిస్థితిలోనూ కలిపి తీసుకోకూడదు. లేదంటే సమస్యలు వస్తాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.







## ఈ పురుగు పొలాల్లో కనిపిస్తే

# శుభ శకునం

ఈ భూమి ఎన్నో కోట్ల జీవులకు ఆవాసం. మనుషులతో పాటు పశుపక్షాదులు, కీటకాలు, రకరకాల పురుగులు, బ్యాక్టీరియా ఈ నేలపై ఉంటాయి. అయితే కొన్ని రకాల పురుగులు కొన్ని ప్రత్యేక సీజన్లలో మాత్రమే కనిపిస్తూ ఉంటాయి. అలానే ఇప్పటి జనరేషన్ వాళ్లకు ఇప్పుడు చెప్పబోయే పురుగు ఏంటో తెలియక పోవచ్చు. అవే "ఆరుద్ర పురుగు". కొన్ని చోట్ల వీటిని పట్టు పురుగు అనీ , చందమామ పురుగు అనీ , లేడీ బర్డ్ అనీ, ఇంద్రగోప పురుగు అని కూడా అంటారు. ఇలా చాలా పేర్లు ఉన్న ఈ పురుగు చూడటానికి ఎర్రని బట్టతో చేసిన బొమ్మలాంటి పురుగులా ఉంటుంది. ముట్టుకుంటేనే అత్తిపత్తి మొక్క ఆకుల్లా ముడుచుకు పోయే స్వభావం ఉన్న ఈ పురుగులు నేలమీద కాసింత ఇసుక నేలల్లో, పచ్చగడ్డి కాసింత ఉన్న చోట్లలో విరివిగా కనిపిస్తాయి. ఈ అందమైన, మెత్తనైన పురుగులు వర్షా కాలం తొలకరి వర్షా లు కురవగానే కుప్పలు కుప్పలుగా కనిపించి కనువిందు చేస్తాయి.

వర్షా లు కురుస్తుండటంతో ఈ మృగశిర కార్తెలోనే ఆరుద్ర పురుగులు నేలపై తిరుగుతూ సందడి చేస్తుంటాయి. రైతులకు ఆనందం కలిగిస్తుంటాయి. అన్నదాతలకు మేలు చేసే ఈ పర్యావరణ నేస్తాలు. ప్రస్తుత తరానికి ఈ ఆరుద్ర పురుగులు అంటే తెలియదు. కానీ పల్లెటూళ్లో ఉండే వారందరికీ ఆ పురుగులు ఏంటో అవి ఎలా ఉపయోగ పడతాయనేది కొంతమందికి మాత్రమే తెలుసు. బీడువారిన నేతలపై తొలకరి జల్లులు పడగానే బిలబిలామంటూ ఆరుద్ర పురుగులు నేలపైకి వచ్చేస్తాయి. అలా ఆరుద్రపురుగులు నేలపై కనిపిస్తే ఆ సంవత్సరం వర్షా లు ఎక్కువగా కురుస్తాయనీ..రైతన్నలు చక్కగా వ్యవసాయం చేసుకోవచ్చని అంటారు. అలా..ఆరుద్ర పురుగులకు , రైతులకు అవినాభావ సంబంధం ఉంది. ఇవి గతంలో ఎక్కువగా కనిపించేవి కానీ,ఇప్పుడు క్రిమి సంహారక మందుల పిచాకారీ , రసాయన ఎరువుల వినియోగం. పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో వాటి ఉనికి కూడా ప్రశ్నార్థకమైంది. మనిషి తనకి మేలుచేసే వాటిని కూడా ఒక్కొక్కదాన్నీ నిర్మూలించుకుంటూ వస్తున్నాడు అనేదానికి ఇది ఒక చక్కని ఉదాహరణనేమో. అయితే ఈ "ఆరుద్ర పురుగు"లను ఏ రైతు చంపడు. ఎవ్వరినీ చంపనీయడు. దేవతలకు,వరుణ దేవుడికి ప్రతిరూపంగా వీటిని భావిస్తారు,కొలుస్తారు. ఆరుద్ర పురుగులు కనిపించాయంటే ఏడాదంతా దండిగా వర్షా లు పడతాయని,కాలవలు చెరువులు, కుంటలు నీటితో నిండుతాయని నమ్మకం. ఎర్రగా, బొద్దుగా చూడటానికి ఎంతో అందంగా ఉండే ఆరుద్ర పురుగు ఆగమనాన్ని అన్నదాతలు శుభసూచకంగా చెబుతుంటారు. ఈ పురుగులు గ్రామాల్లో కనిపించాయంటే రైతులు సంతోషంతో గంతులేస్తారు. ఎందుకంటే ఆరుద్ర పురుగులు కనిపించాయంటే ఆ సంవత్సరం సంవృద్ధిగా వర్షా లు పడతాయని సంకేతం.






# ఇదో అంతుచిక్కని అద్భుతం

స్విమ్మింగ్.. అంటే చాల మంది ఇష్టంగా నేర్చుకుంటారు. అదో సరదా. కానీ కొందరికి స్విమ్మింగ్ రాదు. చాల వరకు గ్రామాల్లో ఉండే వాళ్లకు స్విమ్మింగ్ వచ్చి ఉంటుంది. ఎందుకో మీకు తెలిసిందే, స్కూల్ కి సెలవు దొరికితే చాలు ఊరు పిల్లలు దోస్తులతో కలిసి దగ్గర్లో ఉన్న చెరువులలో ఈదుతూ ఎంజాయ్ చేస్తూ ఉంటారు. అదే పట్టణాల్లో అయితే ఆరోగ్యానికి మంచిదని నేర్చుకుంటారు. స్విమ్మింగ్ వస్తే బీచ్, జలాశయాలు ఇలా ఎక్కడికి వెళ్లిన ప్రమాదం ఉండదు. ఎలాగైనా కూడా స్విమ్ చేస్తారు. ఒకవేళ స్విమ్ రాకపోతే నదులు, బీచ్, జలాశయాలకు వెళ్తే మాత్రం ప్రాణాలు కోల్పోవాలి. కానీ ఈ ప్రపంచంలో ఓ సముద్రంలో మాత్రం ఈత రాకపోయిన మునిగిపోరట. సాధారణంగా ఈత రాకపోతే నీటిలో మునిగిపోతారు. కానీ ఈ సముద్రంలో ఎందుకు మునిగిపోరు. దీనికి గల కారణం ఏంటి? ఈ సముద్రం ఎక్కడ ఉంది? అసలు ఈ సముద్రం లోతు ఉందదా? అనే ప్రశ్నలు మీలో కలగవచ్చు. అందుకే దీని వెనుక కారణం ఏంటో తెలుసుకుందాం.

చూడగలగాలే గానీ ఈ ప్రకృతి అనేక వింతలను మన కళ్ళముందు ఉంచుతుంది. ప్రకృతిలో ఎన్నో రహస్యమైన ప్రదేశాలు ఉన్నాయి. అలాంటి అనేక రహస్యాలు నేటికీ మానవులకు అంతుచిక్కని మిస్టరీగానే మిగిలి ఉన్నాయి. శాస్త్రవేత్తలకు కూడా అంతుచిక్కని కొన్ని వింత ప్రదేశా రహస్యాన్ని తెలుసుకోవడంలో విఫలమయ్యారు. అలాంటి ఒక వింత ప్రదేశాల్లో ఈ సముద్రం కూడా ఒకటి. దీని పేరు 'డెడ్ సీ' జోర్డాన్, ఇజ్రాయెల్ మధ్య ఉంది. ఈ సముద్రం ప్రపంచంలోనే అత్యంత లోతైన ఉప్పునీటి సరస్సుగా పేరుగాంచింది.

ఈ సముద్రంలో ఎవరూ దిగిన కూడా మునిగిపోరు. ఎందుకంటే ఈ సముద్రం నీళ్లలో ఎక్కువగా ఉప్పు ఉంటుంది. అయితే సముద్రం అన్నాక ఉప్పు అనేది సహజం. మరి అన్ని సముద్రాల్లో కూడా ఉప్పు ఉంటుంది. మరి అందులో దిగితే ఎందుకు మునిగిపోతున్నారని అనుకోవచ్చు. అయితే ఈ 'డెడ్ సీ' సముద్రం భూమిపై అత్యల్ప లోయలో ఉంది. దీనివల్ల చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి దాదాపు అన్ని ఖనిజాలు కూడా దానిలోపలికి కొట్టుకుపోతాయి. దీని వల్ల ఈ సముద్రంలో ఎక్కువగా ఖనిజాలు, ఉప్పు ఉంటాయి. మిగతా సముద్రాలతో పోలిస్తే ఈ 'డెడ్ సీ' సముద్రంలో 10 రెట్లు ఎక్కువగా ఉప్పు ఉంటాయి. ఈ కారణం వల్లనే ఇక్కడ ప్రజలు ఎవరూ ఈత కొట్టిన మునిగిపోరు. అలాగే..ఇది సముద్ర మట్టానికి ఇది దాదాపు 1388 అడుగుల దిగువన ఉంది. ఈ సముద్రం సుమారు మూడు లక్షల సంవత్సరాల నాటిదని చెబుతారు. దీని నీటి ప్రవాహం దిగువ నుండి పైకి ఉంటుంది. కాబట్టి నీటిపై పడుకున్నా మునగరు.

ఈ వింత, అద్భుతమైన సముద్రాన్ని చూసేందుకు లక్షలాది మంది పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఎలాంటి భయం లేకుండా తమ ఇష్టానుసారంగా నీళ్లతో ఆడుకోవచ్చు. అయితే 'డెడ్ సీ' సముద్రంలోని ఔషధ గుణాలు, హైలురోనిక్ యాసిడ్ చర్మానికి మేలు చేస్తాయి. అందుకే చాలా మంది పని పెట్టుకుని మరి ఈ సముద్రంలో ఈత కొట్టడానికి వెళ్తుంటారు. ఈ సముద్రం ఎప్పుడూ జనాలతో నిండిపోయి ఉంటుంది.



# మామిడి పండ్లు తింటున్నారా అయితే జాగ్రత్త

సమ్మర్ స్పెషల్ పండ్లు అంటే ఎవరికైనా టక్కున మామిడి పండ్లు గుర్తొస్తాయి. ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ నడుస్తోంది. నిజానికి మామిడి పండ్లను చూస్తే క్షణమైనా ఆగలేం, వాటి రుచిని ఆస్వాదించే దాకా మనసు మనసులో ఉండదు. అయితే ఆ ఆతృతే వద్దంటున్నారు నిపుణులు. ఎందుకు అలా అంటున్నారు, మామిడి పండ్లు ఆరోగ్య కరమే కదా అంటారా. మామిడి పండ్లు మంచివే, కానీ వాటిని తినే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి అవేంటో తెలుసుకుందా..

అయితే మామిడి పండ్లను తినే ముందు కనీసం గంటలపాటు నీళ్లలో నానబెట్టాలంట. లేదంటే ఆ మామిడి పండ్లను తినడం వల్ల అనేక రకాల సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు ఇంట్లో మామిడి కాయలు ఉంటే అమ్మనో, అమ్మమ్మనో ముందే వాటిని నీళ్లున్న టబ్ లో వేసి ఓ గంటాగిన తరువాత తినడానికి ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ఆ సీన్ మారింది. మామిడి పండ్లను ఎంచక్కా ఫ్రిజ్ లో పెట్టి చల్లగా అయ్యాక మండుతున్న ఎండల్లో హాయిగా తింటూ ఉంటారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు అంటున్నారు ఆరోగ్య నిపుణులు.

నీళ్లలో కొద్దిసేపు ఉంచిన మామిడిపండు తింటే శరీరంలో వేడి తగ్గుతుంది. నిజానికి మామిడిపండు తినడం వల్ల శరీరంలో వేడి ఉత్పత్తి అవుతుంది. ఇది జీర్ణక్రియ, చర్మ సంబంధిత సమస్యలను కలిగిస్తుంది. కానీ ఈ సమస్యను నీటిలో కాసేపు ఉంచడం ద్వారా తగ్గించుకోవచ్చు. మామిడిలో ఫైటిక్ యాసిడ్ ఉంటుంది. ఇది యాంటీ న్యూట్రియంట్. ఇది శరీరంలోకి ప్రవేశించినప్పుడు పోషకాలను గ్రహించడంలో ఆటంకం కలిగిస్తుంది. దాని అధిక పరిమాణం కారణంగా శరీరంలో పోషకాల లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది . అయితే మామిడిని కనీసం అరగంట పాటు నీటిలో నానబెట్టడం ద్వారా ఫైటిక్ యాసిడ్ స్థాయిని తగ్గించవచ్చు. ఈ రోజుల్లో ప్రతి పంటకు హానికరమైన పురుగుమందులు, ఎరువులు అధిక పరిమాణంలో ఉ ప యో గిస్తారు. మామిడి సాగులో కూడా ఇవి తప్పనిసరి. ఇవి మామిడి తొక్కపై ఉంటాయి. ఇవి తినేటప్పుడు శరీరంలోకి ప్రవేశిస్తాయి. అందుకే మామిడిని కనీసం అరగంట నుండి గంటసేపైనా నీటిలో ఉంచడం అవసరం. దీని ద్వారా వాటిపై ఉన్న పురుగుమందులు తొలగిపోతాయి. మామిడిలో కొంత మొత్తంలో తెల్లని స్రావం ఉంటుంది. ఇది మొటిమలు, దద్దుర్లు, అలెర్జీ వంటి చర్మ సంబంధిత సమస్యలను కలిగిస్తుంది. మామిడికాయను నీళ్లలో కాసేపు నానబెట్టడం వల్ల స్రావం తగ్గుతుంది. తద్వారా చర్మ సమస్యలు ఏవీ ఇబ్బంది పెట్టవు. మామిడికాయను నీళ్లలో ఉంచకుండా తినడం వల్ల శరీరంలో వేడి పెరుగుతుంది. ఇది జీర్ణ సమస్యలను కూడా కలిగిస్తుంది. అందువల్ల కొంత సమయం పాటు నానబెట్టడం వల్ల ప్రయోజనం ఉంటుంది. మామిడిని నీటిలో ఉంచి తింటే అందులో హైడ్రేటింగ్ లక్షణాలు పెరుగుతాయి.

## పూరి జగన్నాథ్ ఆగి ఆలోచించే రకం కాదు



తెలుగు సినిమా పరిశ్రమలో స్టార్ డైరెక్టర్లలో ఒకరిగా ఎన్నో సంవత్సరాలు విజయవంతంగా కెరీర్‌ను కొనసాగించిన దర్శకుడు పూరి జగన్నాథ్. హీరో పాత్రలను ప్రత్యేకంగా డిజైన్ చేయడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకప్పుడు పూరి దర్శకత్వంలో హీరోగా నటించేందుకు స్టార్ హీరోలు సైతం ఆసక్తి చూపేవారు. అయితే ఇటీవల కాలంలో ఆయన దర్శకత్వంలో వచ్చిన సినిమాలు మాత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోతున్నాయి. ఇదిలా ఉంటే ప్రముఖ కథా రచయిత, దర్శకుడు, నటుడు బివిఎస్ రవి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పూరి జగన్నాథ్‌తో తన అనుబంధం, ఆయన వర్కింగ్ స్టైల్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

రవి మాట్లాడుతూ... పూరి జగన్నాథ్ గారితో చాలా కాలం ప్రయాణం చేశాను. ఆయన వర్కింగ్ స్టైల్ అద్భుతంగా ఉంటుంది. ఆయనతో పని చేయడం ఒక ప్రత్యేకమైన అనుభూతి. యూనిట్‌లో అందరికీ మంచి కంఫర్ట్ ఇస్తారు. ముఖ్యంగా సినిమా కథలను చాలా వేగంగా సిద్ధం చేయడం ఆయన ప్రత్యేకత" అని చెప్పారు. అయితే ఇటీవల కాలంలో పూరి కొంత స్లో అయ్యారని రవి అభిప్రాయపడ్డారు. అలాగే రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ ఒకసారి "పూరి జగన్నాథ్ కాస్త ఆగి, లోతుగా ఆలోచించి కథలు రాస్తే ఆయనను ఆపడం ఎవరి వల్లా కాదు" అని చెప్పారని గుర్తు చేశారు. "అది నిజమే. కానీ పూరి జగన్నాథ్ తన స్టైల్‌లోనే ముందుకు వెళ్లారు. ఎక్కువగా ఆగి ఆలోచించే వ్యక్తి కాదు" అంటూ రవి పేర్కొన్నారు. తాజాగా పూరి జగన్నాథ్ గురించి బివిఎస్ రవి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## రణ్‌వీర్‌ను కాదు.. ఆ ఫిల్మ్ ఫెడరేషన్‌ను బ్యాన్ చేయాలి

ఇండస్ట్రీలో చర్చనీయాశమైన రణ్‌వీర్ సింగ్ బ్యాన్‌పై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ స్పందించారు. 'డాన్ 3' వివాదానికి సంబంధించి ఈ బాలీవుడ్ నటుడిపై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్' విధించిన ఆంక్షలను ఆయన (Ram Gopal Varma) తప్పుపట్టారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఆ ఫిల్మ్ ఫెడరేషన్‌పై నిషేధం విధించాలని అన్నారు.

"గాంధీజీ పంథాలో అంటూ ఎఫ్‌డబ్ల్యూఐసీఈ విధించిన ఈ నిషేధం చూస్తుంటే.. వారిపై వారే వేసుకునే ఒక పెద్ద జోక్‌లా కనిపిస్తోంది. వాళ్లు చెబుతున్నట్లు ఇది పరిశ్రమను, కార్మికులను రక్షించే ప్రయత్నం కాదు. తమ (FWICE) పట్టును కోల్పోకుండా చూసుకోవడం కోసం చేస్తోన్న చర్యలు. వాళ్లు 5 నుంచి 50 లక్షల మంది కార్మికుల తరఫున మాట్లాడుతున్నామని చెబుతున్నారు. కానీ నిజం ఏంటంటే ఆ లక్షలాది మందిలో చాలామందికి ఈ వివాదానికి సంబంధించిన అసలు నిజాలు తెలియవు"

"అసలు ఇది న్యాయస్థానము కాదు, ప్రభుత్వ గుర్తింపు పొందిన నియంత్రణ సంస్థా కాదు. చట్టపరమైన నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి.. ఒక నిర్దిష్ట ఎజెండాతో ప్రైవేటుగా సమావేశమయ్యే కొందరు వ్యక్తులు ఈ తీర్పును ముందే డిసైడ్ చేస్తారు. 'ధురంధర్' సినిమా భారీ విజయంతో రణ్‌వీర్ సింగ్ సాధించిన క్రేజ్ చూసి భయపడుతోన్న కొందరు నటులు కూడా ఇందులో సభ్యులుగా ఉన్నారు" అని వర్మ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. థియేటర్లలో టికెట్లు అమ్ముడయ్యేది రణ్‌వీర్ సింగ్ (Ranveer Singh) లాంటి స్టార్ల వల్లే అని.. ఇలాంటి సంస్థల వల్ల కాదని రామ్ గోపాల్ వర్మ అభిప్రాయపడ్డారు. రణ్‌వీర్ లాంటి స్టార్లే ఆ లక్షలాది మంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్నారని తెలిపారు.



## నాగచైతన్య వ్యక్తిత్వ హక్కులకు రక్షణ

తన పేరుని, చిత్రాల్ని వాణిజ్య వేదికల కోసం వినియోగించడంతోపాటు... అభ్యంతరకరమైన కంటెంట్‌తో ఆన్‌లైన్ దుర్వినియోగానికి పాల్పడటాన్ని సవాల్ చేస్తూ దిల్లీ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కథానాయకుడు నాగచైతన్యకు ఉపశమనం లభించింది. ఆయనకు మధ్యంతర రక్షణని కల్పిస్తూ ఉత్తర్వులిచ్చింది న్యాయస్థానం. నాగచైతన్య తరఫున న్యాయవాది వైభవ్ గగ్గర్ వాదనలు వినిపిస్తూ పలు వెబ్‌సైట్లు అభ్యంతరకమైన కంటెంట్‌తో పాటు, నటుడి వ్యక్తిగత జీవితానికి సంబంధించి పరువు నష్టం కలిగించే విషయాలూ ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయమూర్తి జ్యోతిసింగ్ ఈ కేసుని విచారిస్తూ ప్రతివాదులకు సమన్లు జారీ చేసి, సమాధానాల్ని దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతిస్పందనల దాఖలు తర్వాత ఈ కేసు తదుపరి పరిశీలనకు రానుంది.



## మా శ్రమను గుర్తిస్తారని ఆశిస్తున్నాం..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో వస్తున్న 'పెద్ది' సినిమా జూన్ 4న విడుదల కానుండగా.. ప్రమోషన్స్‌లో జోరు పెంచారు చిత్ర బృందం. ఇందులో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రామ్ చరణ్ తనపై వస్తున్న ట్రోల్స్‌పై స్పందించాడు. 'ట్రోలింగ్స్‌పై నాకు ఎలాంటి అభిప్రాయం లేదు. నా కంట్రోల్‌లో లేని దాని గురించి నేనేం మాట్లాడగలను. అదుపు చేయలేని విషయాలపై నేను స్పందించను. ఒక్కటి మాత్రం చెప్పగలను. మేం తీసే సినిమా అందరికీ నచ్చాలని లేదు.. కానీ మా శ్రమను గుర్తిస్తారని ఆశిస్తున్నాం. అంతే కాదు.. పెద్ది సినిమా నా కెరీర్ బెస్ట్ మూవీ అవుతుందనే నమ్మకం ఉంది' అంటూ ధీమా వ్యక్తం చేశాడు.


ఇక ఈ సినిమా టికెట్ల ధరల విషయానికి వస్తే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'పెద్ది' టికెట్ ధరల పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ.. విడుదలైన మొదటి వారం లేదా పది రోజులు అదనపు ధరలతో పాటు రోజుకు 5 ఆటలు ప్రదర్శించుకునేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 3వ తేదీ రాత్రి ప్రదర్శించే ప్రత్యేక ప్రీమియర్ షో టికెట్ ధరను GSTతో కలిపి రూ. 600గా నిర్ణయించారు. ఆ తర్వాత సాధారణ రోజుల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరపై రూ. 100, అలాగే మల్టీప్లెక్స్‌లలో రూ. 125 చొప్పున అదనంగా పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే.. తెలంగాణలో మాత్రం 'పెద్ది' చిత్రానికి టికెట్ ధరల పెంపు ఉండకపోవచ్చని తెలుస్తోంది. రేట్ల పెంపుదలపై కోర్టులో దాఖలైన పిటిషన్ విచారణ ఆలస్యం అవుతుండటంతోఈ సినిమా విడుదలకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో చిత్ర యూనిట్ తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. దీనివల్ల నైజాం ప్రాంతంలో ఈ సినిమా సాధారణ ప్రభుత్వ ధరలతోనే విడుదల కానున్నట్లుగా సమాచారం.

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ కాంబోలో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది'. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌లో జగపతి బాబు, దివ్యేందు శర్మ, శివరాజ్ కుమార్ వంటి స్టార్స్ కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని ఈ సినిమా జూన్ 4న థియేటర్స్‌లోకి రాబోతుంది. అప్పడే ప్రమోషన్స్ జోరు పెంచిన మూవీ టీమ్ నిత్యం పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నారు. తాజాగా, జాన్వీ ఓ ఇంటర్వ్యూలో భాగంగా చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. జాన్వీ కపూర్ మాట్లాడుతూ.. "రామ్ చరణ్ సార్ చెప్పినట్లుగా.. ఒక సినిమాను పూర్తి నిజాయితీతో, కఠోర శ్రమతో, మంచి ఉద్దేశంతో రూపొందిస్తే, అది కచ్చితంగా చేరాల్సిన ప్రేక్షకులను చేరుతుందని నేను బలంగా నమ్ముతాను. ఈ రోజుల్లో జనాలు చాలా త్వరగా ఒక నిర్ణయానికి వచ్చేసి విమర్శిస్తుంటారని నాకు తెలుసు. కానీ అంతిమంగా చూస్తే సినిమా అనేది ఒక సేవ లాంటిది కదా? ప్రేక్షకులను చేరుకోవడానికి, వారికి థియేటర్లలో మంచి వినోదాన్ని పంచడానికే కదా మనం ఇంత కష్టపడి మూవీస్ తీస్తున్నది. కాబట్టి, ప్రేక్షకులు చిత్రం గురించి ఏమని భావిస్తున్నారు లేదా వారు ఎలాంటి విషయాలు మాట్లాడుకుంటున్నారు అనే అంశాలను మనం పూర్తిగా పట్టించుకోకుండా వదిలేయలేము. నా వ్యక్తిగత ఉద్దేశం ఏమిటంటే.. సినిమా రంగానికి ప్రేక్షకులే దైవంతో సమానం. మనం కేవలం వారి ఇష్టాలను, అవసరాలను గుర్తిస్తూ వారికి మంచి చిత్రాల ద్వారా సేవ చేయడానికి ప్రయత్నిస్తున్నామని నేను భావిస్తాను" అంటూ చెప్పుకొచ్చింది.

## జనాలు చాలా త్వరగా ఒక నిర్ణయానికి వచ్చేసి విమర్శించేస్తారు..



## విలన్ అంటే లావుగా, అసహ్యంగా ఉండాలని ఆ నిర్మాత అన్నాడు



జగపతి బాబు తాజాగా తాను హీరో నుంచి విలన్‌గా మారే సమయంలో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. జగపతిబాబు మాట్లాడుతూ, "ఒక దశలో హీరోగా నా కెరీర్‌ను కొనసాగించడం కష్టంగా అనిపించింది. ఆ సమయంలో కొంతమంది నిర్మాతలు నాతో సినిమాలు చేయడానికి ముందుకు వచ్చినా, నేను వర్కౌట్ కాదని వారికి ముందే చెప్పేవాడిని. నిజానికి అప్పట్లో నా దగ్గర డబ్బులు కూడా లేవు. అయినప్పటికీ వాళ్లకు నష్టం కలగకూడదనే ఉద్దేశంతో హీరోగా సినిమా చేయనని చెప్పాను" అని అన్నారు. అలాగే, "ప్రవరాఖ్యుడు సినిమా సమయంలో కూడా ఇదే విషయం చెప్పాను. కానీ ఆ సినిమా చేయాల్సి వచ్చింది.

హీరోగా నా కెరీర్ ముగిసిందనుకున్న సమయంలో తర్వాత ఏం చేయాలనే ఆలోచన వచ్చింది. సీరియల్స్ చేస్తే రోజుకు రూ.5,000 వస్తాయనే ఆలోచన కూడా వచ్చింది. అదే సమయంలో విలన్ పాత్రలు చేస్తే బాగుంటుందని భావించాను. ఈ విషయంపై ఒకరోజు సురేష్ బాబు గారిని కలిసి మాట్లాడాను. అయితే ఆయన 'విలన్ అంటే లావుగా, అసహ్యంగా ఉండాలి' అని చెప్పారు. అలాంటి సమయంలోనే నాకు లెజెండ్ సినిమాలో అవకాశం వచ్చింది. ఆ సినిమా ద్వారా మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత నా కెరీర్ మంచి దిశలో ముందుకు సాగింది" అని తెలిపారు. ఇక ప్రస్తుతం జగపతిబాబు, రామ్ చరణ్ హీరోగా రూపొందిన పెద్ది చిత్రంలో కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా జూన్ 4న విడుదల కానుంది.

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్యా పాండే, యంగ్ హీరో లక్ష్య జంటగా నటించిన లేటెస్ట్ మూవీ 'చాంద్ మేరా దిల్'. ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ తన ధర్మా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మించారు. ఇటీవల థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్‌ను తెచ్చుకుంది. అయితే, ఈ సినిమాలోని ఒక డ్యాన్స్ సీక్వెన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద వివాదంగా మారింది. ఈ సినిమాలో అనన్యా పాండే చేసిన భరతనాట్యం డ్యాన్స్ క్లిప్స్ నెట్టింట వైరల్ అవ్వడంతో.. ఆమె భరతనాట్య కళను అగౌరవపరిచేలా డ్యాన్స్ చేసిందంటూ నెటిజన్లు, రాజకీయ నాయకులు, కళాకారులు దారుణంగా విమర్శలు గుప్పించారు. అంతేకాదు, ఆమె హావభావాలపై రకరకాల మీమ్స్ క్రియేట్ చేస్తూ సోషల్ మీడియాలో అమ్మడిని ట్రోల్ చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ వివాదం ముదురుతుండటంతో, ఇటీవల అనన్య తండ్రి చుంకీ పాండే స్పందించి తన కూతురికి మద్దతుగా నిలిచారు.

తాజాగా ఈ వివాదంపై స్వయంగా అనన్యా పాండే స్పందించింది. తనపై వస్తున్న నెగిటివిటీపై అనన్య మాట్లాడుతూ.. "నేను ఇకపై ఆ విషయాలను అస్సలు పట్టించుకోను. వాటి గురించి ఆలోచించి సతమతమవ్వడం ఎప్పుడో మానేశాను. ఇప్పుడు నేను ఆ ట్రోలింగ్స్ నుండి పూర్తిగా బయటపడిపోయాను. ఇండస్ట్రీలోకి వచ్చినప్పటి నుండి ఎన్నో ఏళ్లుగా నాపై ఇలాంటి విమర్శలు వస్తూనే ఉన్నాయి. నిరంతరం మనపై వచ్చే నెగిటివిటీని వింటూ కూర్చోవడం లేదా మనల్ని విమర్శించే ఇతరులను సరిదిద్దడానికి టైమ్ వేస్ట్ చేసుకోవడం కంటే.. ప్రతి ఒక్కరూ తమ అంతరాత్మను తాము పరిశీలించుకోవడం మంచిది. మన చుట్టూ పాజిటివిటీని సృష్టించుకోవడానికి ప్రయత్నించడమే అందరికీ శ్రేయస్కరం" అంటూ ట్రోలర్స్‌కు గట్టి సమాధానం ఇచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. నెటిజన్లు మండిపడుతున్నారు. తప్పు చేసిందే కాకుండా క్షమాపణలు చెప్పకుండా.. తెలివిగా మాట్లాడి తప్పించుకోవాలనుకుంటుందని అంటున్నారు.



## ఎట్టకేలకు భరతనాట్యం వివాదంపై స్పందించిన అనన్య పాండే..

Published by Badhe Jayasree on behalf of Siri Media. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : 9697889922. E-Mail : siridailynews@gmail.com.